



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 27 | ఆదివారం 22 జూన్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### మేక్ ఇన్ ఇండియా
## చైనాకే మేలు చేస్తోంది

- కేంద్రం 'మేక్ ఇన్ ఇండియా' విఫలమైందన్న రాహుల్ గాంధీ
- ఈ పథకంతో భారత్ కన్నా చైనాకే ఎక్కువ ప్రయోజనమని ఆరోపణ
- తయారీ రంగం క్షీణించి, నిరుద్యోగం పెరిగిపోయిందని విమర్శ
- ఢిల్లీ నెహ్రూ ప్లేస్‌లో టెక్నీషియన్లతో రాహుల్ గాంధీ ముఖాముఖి



**విజయవాడ-సూర్య వాస్తవం, జూన్ 21**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని, ఇది పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ పథకం ద్వారా మన దేశం కంటే చైనానే అధికంగా లాభపడు తోందని ఆయన ఆరోపించారు. దేశీయంగా తయారీ రంగం కుంటుపడటంతో నిరుద్యోగం కూడా భారీగా పెరిగి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇటీవల ఢిల్లీలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ అయిన 'నెహ్రూ ప్లేస్'ను రాహుల్ గాంధీ సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు టెక్నీషియన్లతో ఆయన ముచ్చటించారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్న రాహుల్, ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ

- మిగతా 2లో..

## భారత్ మౌనం వీడాలి..
### - స్పష్టమైన వైఖరి ఉండాలి : సోనియాగాంధీ

**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం, జూన్ 21**



ఇజ్రాయిల్ ఇరాన్ దాని సార్వభౌమా ధికారాన్ని దెబ్బ తీసేవిధంగా, చట్ట విరు ద్ధంగా దాడి చేసింది. ఈ దాడుల వల్ల ఏకపక్ష సైనికవాదం యొక్క ప్రమాదకర మైన పరిణామాలను ప్రపంచం మరోసారి చూసిందని కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ అన్నారు. ఆమె తాజాగా 'ద హిందూ' ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో ఇజ్రాయిల్ – ఇరాన్ గడ్డపై జరిపిన బాంబు దాడులను భారత జాతీయ కాంగ్రెస్ ఖండించినట్లు రాశారు. ఈ దాడులు ప్రాంతీయం గానూ, ప్రపంచస్థాయి లోనూ పొంచి ఉన్న ముప్పు తీవ్రతను సూచిస్తాయి. గాజా మాదిరిగానే ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి చేయడం వల్ల ఇరాన్ ప్రాంతీయ స్థిరత్వంపైనా, పౌర జీవితాలపై ఆ ప్రభావం పడింది. ఈ చర్యలు అస్థిరతను మరింత తీవ్రతరం చేస్తాయి. సంఘర్షణలకు దారితీస్తాయి. ఇరాన్, అమెరికాల మధ్య దౌత్యసంబంధాలు ఆశాజనకంగా ఉన్న సమయంలోనే ఇరాన్‌పై ఇటువంటి దాడి జరగడం మరింత బాధాకరం. ఈ మానవతా విపత్తు ఎదుర్కొంటున్నప్పుడు భారత్ మౌనం వహించడం దౌత్యపరమైన

- మిగతా 2లో..



## యోగాకు హద్దుల్లేవు
## వయస్సుతో పట్టింపు లేదు

- విశాఖలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ
- యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసిందని మోదీ ప్రశంస
- కోట్లాది మంది జీవితాల్లో యోగా వెలుగులు నింపిందన్న ప్రధాని
- యోగాకు వయసుతో, హద్దులతో పనిలేదన్న మోదీ

**విశాఖపట్నం-సూర్య వాస్తవం, జూన్ 21**


అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం, జూన్ 21, 2025న విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగాకు వయసు, హద్దులు వంటి పరిమితులు లేవని, ఇది అందరికీ చెందిందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల జీవనశైలిలో యోగా అంతర్భాగంగా మారిందని, ఇది ప్రపంచాన్ని ఏకం చేసే శక్తిగా నిలిచిందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన "యోగాంధ్ర" కార్యక్రమాన్ని, ముఖ్యంగా నారా లోకేష్ కృషిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రతాపరావు జాదవ్, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, భూపతిరాజు శ్రీనివాసవర్మ తదితరులు హాజరయ్యారు.

**యోగా ప్రస్థానం – ప్రపంచ ఏకీకరణ**

గత దశాబ్ద కాలంలో యోగా ప్రయాణాన్ని తాను గమనిస్తున్నానని, ఐక్యరాజ్యసమితిలో జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించాలని భారత్ ప్రతిపాదించినప్పుడు అతి తక్కువ సమయంలోనే 175 దేశాలు మద్దతు పలికాయని ప్రధాని గుర్తుచేశారు. ఇది కేవలం ఒక ప్రతిపాదనకు మద్దతు మాత్రమే కాదని, మానవాళి శ్రేయస్సు కోసం ప్రపంచం చేసిన సామూహిక ప్రయత్నమని ఆయన అభివర్ణించారు. "ఈ రోజు, 11 సంవత్సరాల తర్వాత, యోగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల జీవనశైలిలో భాగమైంది. దివ్యాంగులు బ్రెయిలీ లిపిలో యోగా శాస్త్రాన్ని చదవడం, శాస్త్రవేత్తలు అంతరిక్షంలో యోగా చేయడం, యువత యోగా ఒలింపియాడ్‌లలో పాల్గొనడం గర్వకారణం" అని మోదీ అన్నారు. సిడ్నీ ఒపేరా హౌస్ మెట్ల నుంచి ఎవరెస్ట్ శిఖరం వరకు,

- మిగతా 2లో..



## యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

- విశాఖలో 'యోగాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- కార్యక్రమానికి 1.44 లక్షల యోగా శిక్షకులు నమోదు చేసుకున్నారని వెల్లడి
- సూర్య నమస్కారాలతో గిరిజన విద్యార్థుల గిన్నిస్ రికార్డును ప్రస్తావించిన సీఎం
- యోగా క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంపొందిస్తుందని వ్యాఖ్య

2లో



### అంతర్జాతీయ యోగా దినోత్సవం
## భారత్‌కు లభించిన గొప్ప గౌరవం

2లో

- 'యోగాంధ్ర' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ప్రసంగం
- యోగా ప్రాముఖ్యతను రుగ్వేదం చెప్పిందని.. మోదీ ప్రపంచానికి చాటారని వెల్లడి
- ప్రధాని మోదీ సమక్షంలో చంద్రబాబు కృషితో ప్రపంచ రికార్డు సాధిస్తామని వ్యాఖ్య
- సాగర తీరంలో 11వ యోగా దినోత్సవ వేడుకలకు లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### ప్రధాని మోదీకి
## గిన్నిస్ కానుకగా 'యోగాంధ్ర'

- విశాఖలో యోగాంధ్ర అద్భుతంగా జరిగిందని మంత్రి లోకేశ్ ఆనందం
- ప్రజల చైతన్యంతోనే ఈవెంట్ విజయవంతం అయిందన్న లోకేశ్
- అమరావతే పరిపాలనా రాజధాని, అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి
- విశాఖను దక్షిణ భారత ఐటీ హబ్‌గా తీర్చిదిద్ది 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం

2లో



# భారత్ మౌనం వీడాలి..

(మొదటిపేజీ తరువాయి)

లోపాన్ని ఎత్తిచూపుతున్నదని సోనియా వ్యాసంలో పేర్కొన్నారు.

సోనియా గాంధీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కూడా విమర్శలు గుప్పించారు. ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తూ, అందుకు అనుకూలంగా తన సొంత నిఘా వర్గాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ట్రంప్ గతంలో పలు యుద్ధాలు, సైనిక-పారిశ్రామిక సముదాయ శక్తుల గురించి హెచ్చరించారని, అయితే ఇప్పుడు ఇరాక్ యుద్ధానికి దారితీసిన తప్పులను పునరావృతం చేస్తున్నట్లు కనిపిస్తోందని సోనియా పేర్కొన్నారు.

గాజా- ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో శాంతియుతంగా రెండు దేశాల పరిష్కారానికి భారత్ తన వైఖరికిగా ఉండాలని ఆమె ఈ వ్యాసంలో పేర్కొన్నారు. సార్వభౌమ స్వతంత్ర పాలస్తీనాను, ఇజ్రాయిల్ పరస్పర భద్రతను కల్పించడం అనే భారత్ దీర్ఘకాలిక దౌత్యపరమైన నిబద్ధతను మోడీ ప్రభుత్వం విస్మరించింది అని సోనియా తెలిపారు. గాజాలోనూ, ఇప్పుడు ఇరాన్‌పై జరుగుతున్న విధ్వంసంపై భారత్ మౌనం వహించడం మన నైతిక, దౌత్య సంప్రదాయాల నుంచి తప్పించుకోవడమే అని ఆమె అన్నారు.

ఇరాన్ భారతదేశానికి దీర్ఘకాల మిత్రదేశం. జమ్మూ కశ్మీర్‌తో సహా కీలక సమయాల్లో భారత్‌కు ఇరాన్ మద్దతు ఉన్నదన్నారు. 1994లో కాశ్మీర్ సమస్యపై యూఎన్ కమిషన్ ఆన్ హ్యూమన్ రైట్స్‌లో భారతదేశాన్ని విమర్శించే తీర్మానాన్ని నిరోధించడంలో ఇరాన్ సహాయపడిందని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తన దౌత్య పాత్రను పునరుద్ఘాటించాలని భారత ప్రభుత్వానికి సోనియా గాంధీ విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధంలో భారత్ కల్పించుకోకపోవడాన్ని విలువల లొంగుబాటునే సూచిస్తుందని ఆమె విమర్శించారు. ఈ విషయంలో భారత్ వైఖరి స్పష్టంగా ఉండాలని, బాధ్యతా యుతంగా వ్యవహరించాలని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను అనుసరించాలని ఆమె సూచించారు.

## మేక్ ఇన్ ఇండియా చైనాకే మేలు చేస్తోంది

విధానాలపై తన అసంతృప్తిని వెళ్లగక్కారు.

"మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంతో దేశంలో ఫ్యాక్టరీ రంగం ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. మరి అలాంటప్పుడు తయారీ రంగం ఎందుకు రికార్డు స్థాయిలో కనిష్ఠానికి పడిపోయింది? యువతలో నిరుద్యోగిత రేటు ఎందుకు ఇంతగా పెరిగింది? చైనా నుంచి దిగుమతులు రెట్టింపు ఎందుకయ్యాయి?" అంటూ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

ప్రధాని మోదీ కేవలం నినాదాలు ఇవ్వడంలోనే నిష్ణాతులని, సమస్యలకు పరిష్కారాలు చూపడంలో కాదని ఆయన ఎద్దేవా చేశారు. "2014 నుంచి చూస్తే, మన ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగం వాటా 14 శాతానికి తగ్గిపోయింది. నిజం చెప్పాలంటే, మనం వస్తువులను ఇక్కడ కేవలం అసెంబ్లింగ్ చేస్తున్నాం, దిగుమతి చేసుకుంటున్నాం తప్పితే, వాటిని పూర్తిస్థాయిలో తయారుచేయడం లేదు. దీనివల్ల, ఆ వస్తువులను తయారుచేస్తున్న చైనా లాభాల పంట పండించుకుంటోంది" అని రాహుల్ విశ్లేషించారు.

ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను కూడా ప్రభుత్వం క్రమంగా వెనక్కి తీసుకుంటోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ తయారీ రంగంలో సంస్కరణలు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. "మనం ఇతరులకు కేవలం మార్కెట్‌గా మిగిలిపోకూడదు. మన వస్తువులను మనమే ఇక్కడ ఉత్పత్తి చేసుకోవాలి, ఇక్కడే కొనుగోళ్లు జరపాలి. ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి" అని రాహుల్ గాంధీ తన పోస్టులో పేర్కొన్నారు.

## ప్రధాని మోదీకి గిన్నిస్ కానుకగా 'యోగాంధ్ర'

**- విశాఖలో యోగాంధ్ర అద్భుతంగా జరిగిందని మంత్రి లోకేశ్ ఆనందం**

**- ప్రజల చైతన్యంతోనే ఈవెంట్ విజయవంతం అయిందన్న లోకేశ్**

**- అమరావతే పరిపాలనా రాజధాని, అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి**

**- విశాఖను దక్షిణ భారత ఐటీ హబ్‌గా తీర్చిదిద్ది 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం**

**విశాఖపట్నం-సూర్య వాస్తవం, జూన్ 21**

ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేరుస్తున్నారని, దానికి కృతజ్ఞతగా ఆయనకు ఒక గిన్నిస్ రికార్డును కానుకగా అందించాలనే సదుద్దేశంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు.

"మేము ఊహించిన దానికంటే ఎక్కువ మంది ప్రజలు యోగాంధ్ర కార్యక్రమానికి తరలివచ్చారు. ప్రజలలో వెల్లివిరిసిన చైతన్యం కారణంగానే యోగాంధ్ర ఇంతటి ఘన విజయం సాధించింది. ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపునకు స్పందించి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ముగియడానికి పటిష్టమైన ఏర్పాట్లే కారణమని ఆయన అన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు నాపై మరింత బాధ్యతను పెంచాయి. యోగాంధ్ర కార్యక్రమం కేవలం ఒక ఈవెంట్ కాదు. ఇది యావత్ ఆంధ్రుల విజయం" అని లోకేశ్ తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల గురించి మాట్లాడుతూ... "పరిపాలన సౌలభ్యం కోసమే అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేశాం. అయితే, అభివృద్ధిని అన్ని ప్రాంతాలకూ వికేంద్రీకరిస్తాం" అని లోకేశ్ స్పష్టం చేశారు. "విశాఖపట్నం నగరాన్ని దక్షిణ భారతదేశంలోనే అత్యున్నతమైన ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలన్నది మా సంకల్పం. దీని ద్వారా విశాఖలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం," అని మంత్రి నారా లోకేశ్ వివరించారు.

# యోగాకు హద్దుల్లేవు.. వయస్సుతో పట్టింపు లేదు








(మొదటిపేజీ తరువాయి)

సముద్ర విస్తీర్ణం వరకు ప్రతిచోటా "యోగ అందరిదీ, అందరి కోసం" అనే సందేశం ప్రతిధ్వనిస్తోందని ఆయన పేర్కొన్నారు.

**యోగాంధ్రకు ప్రధాని ప్రశంసలు**

ఆంధ్రప్రదేశ్‌లో యోగా దినోత్సవ కార్యక్రమాల నిర్వహణ అద్భుతంగా ఉందని ప్రధాని మోదీ కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర" అనే అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రశంసించారు. "యోగ కార్యక్రమాన్ని సామాజికంగా ఎలా నిర్వహించాలో, సమాజంలోని అన్ని వర్గాలను ఎలా భాగస్వాములను చేయాలో నారా లోకేష్ గారు గత నెల, నెలన్నర రోజులుగా సాగిన యోగాంధ్ర ప్రచారంలో చేసి చూపించారు. ఇందుకోసం సోదరుడు లోకేష్ ఎన్నో అభినందనలకు అర్హులు. ఇలాంటి కార్యక్రమాలను సామాజిక స్థాయిలో ఎంత లోతుగా తీసుకెళ్లవచ్చో లోకేష్ చేసిన పనిని ఒక నమూనాగా చూడాలి" అని ప్రధాని మోదీ అన్నారు. యోగాంధ్ర ప్రచారంతో 2 కోట్లకు పైగా ప్రజలు అనుసంధానమయ్యారని తనకు తెలిసిందని, ఈ ప్రజా భాగస్వామ్య స్ఫూర్తే వికసిత భారత్‌కు మూలాధారమని ఆయన పేర్కొన్నారు.

**ఒకే భూమి - ఒకే ఆరోగ్యం**

ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ ఇతివృత్తం "ఒకే భూమి %-% ఒకే ఆరోగ్యం కోసం యోగా" అని ప్రధాని తెలిపారు. "భూమిపై ప్రతి జీవి ఆరోగ్యం ఒకదానితో ఒకటి ముడిపడి ఉందనే లోతైన సత్యాన్ని ఈ ఇతివృత్తం ప్రతిబింబిస్తుంది. మానవ శ్రేయస్సు మనం పండించే నేల ఆరోగ్యంపైనా, మనకు నీరందించే నదులపైనా, మన పర్యావరణ వ్యవస్థను పంచుకునే జంతువుల ఆరోగ్యంపైనా, మనల్ని పోషించే మొక్కలపైనా ఆధారపడి ఉంటుంది. యోగా ఈ పరస్పర సంబంధాన్ని మనకు మేల్కొలుపుతుంది" అని మోదీ వివరించారు.

**శాంతి, సమగ్రతకు యోగా**

ప్రస్తుతం ప్రపంచం అనేక ఒత్తిళ్లతో సతమతమవుతోందని, పలు ప్రాంతాల్లో అశాంతి, అస్థిరత నెలకొన్నాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో యోగా శాంతి దిశగా మార్గం చూపుతుందని అన్నారు. "మానవాళికి కాస్త విరామం ఇచ్చి, శ్వాస తీసుకుని, సమతుల్యం సాధించి, తిరిగి సంపూర్ణంగా మారడానికి యోగా ఒక పాజ్ బటన్ లాంటిది" అని ఆయన వర్ణించారు. అంతర్గత శాంతి ప్రపంచ విధానంగా మారే "మానవాళి కోసం యోగా 2.0"కు ఈ యోగా దినోత్సవం నాంది పలకాలని ఆయన ఆకాంక్షించారు.

**యోగా పరిశోధన, ప్రోత్సాహం**

యోగా విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనలతో మరింత బలోపేతం చేయడానికి భారత్ కృషిచేస్తోందని ప్రధాని తెలిపారు. దేశంలోని ప్రముఖ వైద్య సంస్థలు యోగాపై పరిశోధనలు చేస్తున్నాయని, ఎయిమ్స్ పరిశోధనలో గుండె, నరాల సంబంధిత రుగ్మతల చికిత్సలో, మహిళల ఆరోగ్యం, మానసిక శ్రేయస్సులో యోగా కీలక పాత్ర పోషిస్తున్నట్లు తేలిందని ఆయన వెల్లడించారు. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా యోగా, వెల్‌నెస్ మంత్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని, డిజిటల్ టెక్నాలజీ కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. యోగా పోర్టల్, యోగేంద్ర పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా కార్యక్రమాలు నమోదయ్యాయని తెలిపారు. భారత్ ప్రపంచానికి ఉత్తమ హీలింగ్ కేంద్రంగా మారుతోందని, ఇందుకు ప్రత్యేక ఈ-ఆయుష్ వీసాలు కూడా అందిస్తున్నామని ఆయన చెప్పారు.

**స్థూలకాయంపై పోరుకు పిలుపు**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్థూలకాయం సమస్యపై కూడా దృష్టి సారించారు. "పెరుగుతున్న స్థూలకాయం ప్రపంచానికి పెద్ద సవాలు. దీనికోసం మన ఆహారంలో 10% నూనె వాడకాన్ని తగ్గించే ఛాలెంజ్‌ను కూడా ప్రారంభించాను. ఈ ఛాలెంజ్‌లో చేరాలని దేశ, ప్రపంచ ప్రజలకు మరోసారి పిలుపునిస్తున్నాను. నూనె వాడకం తగ్గించడం, అనారోగ్యకరమైన ఆహారాన్ని నివారించడం, యోగా చేయడం మెరుగైన ఫిట్‌నెస్‌కు మూలికలు" అని ఆయన సూచించారు. యోగాను ఒక ప్రజా ఉద్యమంగా మార్చి, ప్రపంచాన్ని శాంతి, ఆరోగ్యం, సామరస్యం వైపు నడిపించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నాయకత్వాన్ని, ప్రజలను అభినందిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న యోగా అభ్యాసకులకు, యోగా ప్రేమికులకు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం: సీఎం చంద్రబాబు

**- విశాఖలో 'యోగాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి**

**- కార్యక్రమానికి 1.44 లక్షల యోగా శిక్షకులు నమోదు చేసుకున్నారని వెల్లడి**

**- సూర్య నమస్కారాలతో గిరిజన విద్యార్థుల గిన్నిస్ రికార్డును ప్రస్తావించిన సీఎం**

**- యోగా క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంపొందిస్తుందని వ్యాఖ్య**

**విశాఖపట్నం-సూర్య వాస్తవం, జూన్ 21**

యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఒత్తిడి తగ్గి రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్, కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "యోగాను భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చిన దార్శనిక ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ఆయన ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించి, యోగాను ప్రపంచ ఆరోగ్య ఉద్యమంగా మార్చారు," అని కొనియాడారు. నేడు 175కు పైగా దేశాల్లో, 12 లక్షల ప్రదేశాల్లో 10 కోట్లకు పైగా ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొంటున్నారని తెలిపారు. జాతీయత, ప్రాంతం, మతం, భాషలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను స్వీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.యోగా వల్ల శరీరం, మనసు, ఆత్మల కలయిక జరుగుతుందని, ఇది శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, రోగనిరోధక శక్తి పెంపు, ఆత్మవిశ్వాసం, స్వీయ ఆవిష్కరణ, మానసిక ప్రశాంతత, అంతర్గత శాంతి, సంపూర్ణ శ్రేయస్సుకు దోహదపడుతుందని వివరించారు. దీని ఫలితంగా హింస తగ్గి శాంతి నెలకొంటుందని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ (ఏఐ)తో సహా సాంకేతిక పరిజ్ఞానం యోగాను మరింత అందుబాటులోకి తెచ్చిందని చంద్రబాబు తెలిపారు.

ప్రధాని మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో నెల రోజుల పాటు యోగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించామని, ఇందులో భాగంగా 1.44 లక్షల మంది యోగా శిక్షకులకు శిక్షణ ఇచ్చి, 1.4 లక్షల ప్రదేశాలలో 2.17 కోట్ల మందికి పైగా భాగస్వాములను నమోదు చేశామని సీఎం వివరించారు. ఒక్క విశాఖపట్నంలోనే నగరం నుంచి భోగాపురం వరకు 28 కిలోమీటర్ల మేర 3 లక్షల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, మొత్తం 1.7 కోట్ల సర్టిఫికేట్లు జారీ చేశామని వెల్లడించారు. నిన్న 22,122 మంది గిరిజన విద్యార్థులు ఏకకాలంలో సూర్యనమస్కారాలు చేసి గిన్నిస్ రికార్డు సాధించడం గర్వకారణమని, వారికి అభినందనలు తెలిపారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం భారత్‌కు లభించిన గొప్ప గౌరవం

**- 'యోగాంధ్ర' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ప్రసంగం**

**- యోగా ప్రాముఖ్యతను రుగ్వేదం చెప్పిందని.. మోదీ ప్రపంచానికి చాటారని వెల్లడి**

**- ప్రధాని మోదీ సమక్షంలో చంద్రబాబు కృషితో ప్రపంచ రికార్డు సాధిస్తామని వ్యాఖ్య**

**- సాగర తీరంలో 11వ యోగా దినోత్సవ వేడుకలకు లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు**

**విశాఖపట్నం-సూర్య వాస్తవం, జూన్ 21**

యోగా అనేది భారతీయులకు దక్కిన అమూల్యమైన గౌరవమని, దీనిని ప్రపంచవ్యాప్తం చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే చెందుతుందని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సూర్య భగవానునికి, యోగ విద్యను అందించిన ఆదియోగి పరమశివునికి, యోగశాస్త్ర రూపంలో మనకందించిన పతంజలి మహర్షికి వందనాలు తెలుపుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. భారతీయ సనాతన ధర్మం యొక్క విశిష్టతను యోగా ద్వారా విశ్వవ్యాపితం చేసిన దార్శనికులు ప్రధాని నరేంద్ర మోదీ అని పవన్ కళ్యాణ్ కొనియాడారు. యోగా సాధకులు ఎంతటి దృఢచిత్తాన్ని కలిగి ఉంటారో, ఒత్తిడిని జయించి సంకల్ప సాధకులుగా ఎలా నిలబడతారో చెప్పడానికి ప్రధాని మోదీయే నిలువెత్తు ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం యావత్ భారత ప్రజలకు, భారతీయులందరికీ దక్కిన గౌరవంగా ఆయన అభివర్ణించారు.

2014లో ఐక్యరాజ్యసమితిలో ప్రధాని మోదీ యోగా దినోత్సవంపై తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు, దాదాపు 177 దేశాలు మద్దతు పలికాయని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు. అంతర్జాతీయంగా ఇంతటి మద్దతు కూడగట్టడం వల్లే 2015 నుంచి యోగా దినోత్సవం అధికారికంగా ప్రారంభమైందని తెలిపారు. ఈ ఏడాది విశాఖపట్నం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సంబరాలకు వేదిక కావడం సంతోషకరమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డుకు వేదికగా నిలిచిందని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. "వన్ ఎర్త్, వన్ హెల్త్" అనే థీమ్‌ను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. యోగా గొప్పదనాన్ని ఋగ్వేదంలోనే మన మహానుభావులు తెలియజేశారని, దానిని ప్రపంచానికి చాటిచెప్పిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## సంపాదకీయం

# యోగా విరామ బటన్


ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది పాల్గొన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేసి.. యోగాంధ్రలో పాల్గొన్నారు. యోగా కేవలం వ్యక్తిగత సాధన మాత్రమే కాకుండా, ప్రపంచ భాగస్వామ్యానికి మాధ్యమంగా మారాలని, ప్రతి దేశం, సమాజం యోగాను తమ జీవన విధానంలో, ప్రభుత్వ విధానంలో భాగంగా చేసుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, యోగా కేవలం వ్యాయామం కాదని, అదొక జీవన విధానమని అన్నారు. "యోగా అంటే సరళంగా చెప్పాలంటే కలపడం. ఇది ప్రపంచాన్ని కలిపింది" అని ఆయన తెలిపారుయోగా ప్రపంచాన్ని కలిపింది. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. ఇది మనతోనే సాధ్యమైంది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది జీవనశైలిని యోగా మార్చింది. నేవీకి చెందిన నౌకల్లో యోగాసనాలు వేస్తున్నారు. యోగా అందరి కోసం. ప్రగతి, ప్రకృతి సంగమస్థలి విశాఖ నగరం. చంద్రబాబు, పవన్, లోకేష్‌కు అభినందనలు. వన్ ఎర్త్.. వన్ హెల్త్ థీమ్‌తో ఈ సారి యోగా డే జరుపుకుంటున్నాం. ప్రపంచంతో మనం అనుసంధానం కావడానికి యోగా ఉపయోగపడుతుంది.అందరి క్షేమమే నా కర్తవ్యమని భారతీయ సంస్కృతి నేర్పుతుంది. ప్రపంచం ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటుంది. ఈ పరిస్థితుల్లో యోగా శాంతికి తోడ్పడుతుంది. యోగా మనలో మానవత్వం పెంచుతుంది. వ్యక్తిగత క్రమశిక్షణకు యోగా ఒక అద్భుత సాధనం. నేను నుంచి మనం అనే భావనకు తీసుకెళ్లే ఆయుధం. ఒబేసిటీ అనేది ప్రపంచానికి పెద్ద సమస్య. తీసుకునే ఆహారంలో నూనె పదార్థాలను 10 శాతం తగ్గించాలి. యోగాను ఒక ఉద్యమంలా తీసుకెళ్లాలి. అందరికి యోగాతో ప్రతి రోజు మొదలవ్వాలి." అని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాన మంత్రి మోదీ మాట్లాడుతూ, జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి భారతదేశం ఒక తీర్మానాన్ని సమర్పించిన రోజును గుర్తు చేసుకున్నారు. చాలా తక్కువ సమయంలో, ప్రపంచంలోని 175 దేశాలు మన దేశంతో నిలబడ్డాయి. నేటి ప్రపంచంలో ఈ ఐక్యత మరియు మద్దతు సాధారణ సంఘటన కాదు" అని ఆయన అన్నారు. సమకాలీన కాలంలో భౌగోళిక రాజకీయ అశాంతి మరియు ప్రాంతీయ అస్థిరతను ప్రస్తావిస్తూ, మోదీ "యోగా మనకు శాంతి దిశను ఇస్తుంది'' అని అన్నారు. "మానవాళికి శ్వాస తీసుకోవడానికి, సమతుల్యం చేయడానికి మరియు తిరిగి సంపూర్ణంగా మారడానికి యోగా ఒక విరామ బటన్" అని ఆయన అన్నారు. యోగాను శతాబ్దాల నుంచి ఋషులు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం, ప్రపంచం మొత్తం యోగా ప్రాముఖ్యతను అర్థం చేసుకుంది. దానిని అంగీకరించింది. నేడు, దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు యోగాభ్యాసం ద్వారా తమను తాము ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. యోగా బరువు తగ్గడానికి ఒక మార్గం మాత్రమే కాదు. యోగాభ్యాసం సమయంలో, అనేక రకాల ఆసనాలు, కార్యకలాపాలు చేస్తుంటారు. ఇది ఒక వ్యక్తికి శారీరకంగా, మానసికంగా ప్రయోజనం చేకూరుస్తుంది.క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీర నొప్పి, శరీర భంగిమ, అనేక ఆరోగ్య సమస్యలు మెరుగుపడతాయి. బహుశా అందుకే నేటి కాలంలో, పిల్లల నుంచి వృద్ధుల వరకు, ప్రతి ఒక్కరూ తమ ఫిట్‌నెస్ దినచర్యలో యోగాను చేర్చుకోవడానికి ఇష్టపడతారు. కానీ మీరు యోగా నుంచి నిజంగా ప్రయోజనాలను పొందుతున్నారో లేదో తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం. కాబట్టి ఈ వ్యాసంలో ఇప్పుడు మనం యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం.మీరు యోగాను క్రమం తప్పకుండా, సరిగ్గా సాధన చేసినప్పుడు, అది మీ శరీరం వశ్యతను మెరుగుపరుస్తుంది. మీ కీళ్ళు, కండరాలలో కదలిక పరిధి పెరుగుదలను మీరు గమనించవచ్చు. మీ కాలి వేళ్లను తాకడం, వెనుకకు వంగడం లేదా గతంలో కష్టంగా అనిపించిన భంగిమలను చేయడం మీకు సులభం అనిపించవచ్చుమీరు క్రమం తప్పకుండా యోగా సాధన చేసినప్పుడు, అది మీ శరీర భంగిమను కూడా మెరుగుపరుస్తుంది. ఇప్పుడు మీరు మీ భంగిమ గురించి ఎక్కువ ఆలోచించాల్సిన అవసరం లేదు. కానీ మీరు నిలబడటం లేదా నిటారుగా కూర్చోవడం అవసరం. మీ వెన్నెముక అమరిక మెరుగుపడుతుంది. మీరు వంగడం వంటి సమస్య నుంచి కూడా దూరం అవుతారు. అంతే కాదు, శరీర భంగిమ సరిగా లేకపోవడం వల్ల కలిగే మెడ నొప్పి, వెన్నునొప్పి వంటి సమస్యలను కూడా దూరం చేస్తుంది. యోగా సాధన ప్రారంభించినప్పుడు, కొన్ని రోజుల్లోనే మీలో మార్పును మీరు అనుభూతి చెందడం ప్రారంభిస్తారు. యోగా ఆరోగ్యానికి మేలు చేసినప్పుడు, కొన్ని సానుకూల మార్పులు కనిపించడం ప్రారంభిస్తాయి. ఉదాహరణకు, ఇది శరీర శక్తి స్థాయిని పెంచుతుంది. మీరు రోజంతా మరింత చురుకుగా ఉంటారు. మీరు త్వరగా అలసిపోయినట్లు లేదా బలహీనంగా అనిపించదు. యోగాభ్యాసం ప్రారంభించినప్పుడు, అది మీ జీర్ణవ్యవస్థపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. మీ జీర్ణ అవయవాలకు మంచి మసాజ్ ఇచ్చే అనేక యోగాసనాలు ఉన్నాయి. ఇది రక్త ప్రసరణ, ఆక్సిజన్‌ను కూడా మెరుగుపరుస్తుంది. అటువంటి పరిస్థితిలో, ఒక వ్యక్తి మలబద్ధకం వంటి జీర్ణ సంబంధిత సమస్యలను తక్కువగా ఎదుర్కోవలసి ఉంటుంది. మీ ప్రేగు కదలిక మునుపటి కంటే మెరుగ్గా ప్రారంభమైతే, మీరు యోగాభ్యాసం నుంచి ప్రయోజనాలను పొందుతున్నారని అర్థం.

## పామిడిలో యోగా దినోత్సవం



**పామిడి – సూర్య వాస్తవం, జూన్ 21:** పామిడిలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పామిడి లో ఉన్న అన్ని గ్రామ సచివాలయంలో శనివారం నాడు యోగాంధ్ర కార్య క్రమంలో పెద్ద ఎత్తున నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులు పాల్గొని యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల స్థాయి పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు మండల కేంద్రం పొగురురు గ్రామంలో యోగాసనాలు నిర్వహించారు.

# ఇప్పటికీ 52 శాతం కూటమికి జై



**విజయవాడ – సూర్యవాస్తవం, జూన్ 21**

కూటమి ప్రభుత్వం ఎలా పని చేస్తోంది? తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకొని చేపట్టిన సర్వే ఫలితాలను రైజ్ సంస్థ ప్రకటించింది. 175 అసెంబ్లీ సీట్లతో పాటు 25 పార్లమెంట్ సీట్లలోనూ టార్గా పరిస్థితులను వివరిస్తూ ప్రవీణ్ పుల్లట నేతృత్వంలోని రైజ్ సర్వే సంస్థ గత కొద్ది రోజులుగా సర్వే చేపట్టింది. ..కూటమి ఏడాది పాలన పూర్తి చేసుకుంది. రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఇటువంటి సమయంలో ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది? కూటమి ప్రభుత్వం ఎలా పని చేస్తోంది? తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకొని చేపట్టిన సర్వే ఫలితాలను రైజ్ సంస్థ ప్రకటించింది. 175 అసెంబ్లీ సీట్లతో పాటు 25 పార్లమెంట్ సీట్లలోనూ టార్గా పరిస్థితులను వివరిస్తూ ప్రవీణ్ పుల్లట నేతృత్వంలోని రైజ్ సర్వే సంస్థ గత కొద్ది రోజులుగా సర్వే చేపట్టింది.

ఇప్పటివరకు రీజియన్ల వారీగా ఫలితాలను ప్రకటించిన ప్రవీణ్ పుల్లట. ఇప్పుడు సమగ్రంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను, సర్వేలో తేలిన అంశాలను వెల్లడించారు. ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ పెద్దల పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయం, ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరు వంటివి ఈ సర్వేలో వెల్లడయ్యాయి. ప్రభుత్వ పనితీరుకు సంబంధించి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చింది. కూటమి ప్రభుత్వ పనితీరు బాగుందని 52.8శాతం ప్రజలు అభిప్రాయ పడ్డారు. బాగాలేదని 26శాతం.. ఫర్వాలేదని 21.2 శాతం ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వ పనితీరు బాగుందని అడిగితే.. కూటమి ప్రభుత్వ పనితీరు బాగుందని 51శాతం, వైసీపీ ప్రభుత్వ పనితీరు బాగుందని 38 శాతం మంది అభిప్రాయపడ్డారు. మరో 11 శాతం మంది మాత్రం చెప్పలేమని చెప్పేశారు. ఎక్కువ సంక్షేమం అందించిన సీఎం జగన్ అని 52శాతం, చంద్రబాబు అని 48 శాతం మంది చెప్పారు. కూటమి ఎమ్మెల్యేల పనితీరు గురించి అడిగితే బాగుందని కేవలం 28 శాతం మంది చెప్పడం విశేషం. 64 శాతం మంది బాగాలేదని తేల్చి చెప్పడం గమనార్హం. ఏ సీఎం హయాంలో అభివృద్ధి ఎక్కువగా జరిగిందని అడిగితే చంద్రబాబు అని 59శాతం, జగన్ అని మరో 41 శాతం మంది చెప్పారు. అమరావతిపై అభిప్రాయం అడిగితే దానిపైన ఎక్కువగా ఫోకస్ పెడుతున్నారని 78శాతం మంది, రాజధాని అభివృద్ధి చెందాలని మరో 22 శాతం మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

రాష్ట్ర మంత్రివర్గంలో ఆరుగురు మంత్రుల తీరు బాగుందని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, లోకేష్, నారాయణ, రామానాయుడు, పయ్యావుల కేశవ్ పనితీరు బాగుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి పనితీరు పర్వాలేదని చెప్పారు. కానీ పదిమంది మంత్రుల పనితీరు బాగాలేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అందులో కొల్లు రవీంద్ర, సత్య కుమార్ యాదవ్, పార్థసారథి, దూల బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, సవిత, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్ ఉన్నారు.

**ఎంపీల విషయానికి వస్తే..**

ఎంపీల పనితీరుకు సంబంధించి గ్రీన్ జోన్లో తొలి స్థానంలో పెమ్మసాని చంద్రశేఖర్, రెండో స్థానంలో కింజరాపు రామ్మోహన్ నాయుడు, మూడో స్థానంలో బైరెడ్డి శబరి, నాలుగో స్థానంలో కేసినేని చిన్ని, ఐదో స్థానంలో లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆరో స్థానంలో పుట్టా మహేష్, ఏడో స్థానంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ గురుమూర్తి ఉన్నారు. ఆరెంజ్ జోన్ లో బాలసౌరి, శ్రీ భరత్, పురందేశ్వరి, కలిశెట్టి అప్పలనాయుడు, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, దగ్గుమల్ల ప్రసాదరావు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీఎం రమేష్, శ్రీనివాస వర్మ, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, హరీష్ మాధుర్ ఉన్నారు. రెడ్ జోన్ లో మాగుంట శ్రీనివాసుల రెడ్డి, తెన్నేటి కృష్ణ ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ, వైయస్ అవినాష్ రెడ్డి, తనుజారాణి, బస్తిపాటి నాగరాజు ఉన్నారు.

**గ్రీన్ జోన్**

ఎమ్మెల్యేల విషయానికి వస్తే గ్రీన్ జోన్లో 32 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో ఇచ్చాపురం, టెక్కలి, బొబ్బిలి, అనకాపల్లి, భీమిలి, గాజువాక, నర్సీపట్నం, పాయకరావుపేట, విశాఖ తూర్పు, అమలాపురం, మండపేట, పిఠాపురం, రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, గోపాలపురం, పాలకొల్లు, ఉండి, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు, మంగళగిరి,పొన్నూరు, కొండేపి, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, చంద్రగిరి, పలమనేరు, కుప్పం, పుంగనూరు, పులివెందుల, హిందూపూరం, ఉరవకొండ, బనగానపల్లి నియోజకవర్గాలు సేఫ్ జోన్ లో ఉన్నాయి.

**ఆరెంజ్ జోన్**

90 నియోజకవర్గాలు ఉన్నాయి. ఆమదాలవలస , ఎచ్చెర్ల,పలాస, గజపతినగరం, నెల్లిమర్ల, సాలూరు, కురుపాం, విజయనగరం, రాజాం,ఎస్ కోట, చోడవరం, పెందుర్తి, విశాఖ నార్త్,విశాఖ వెస్ట్, ప్రత్తిపాడు, అనపర్తి,జగ్గంపేట, కొత్తపేట, ముమ్మిడివరం, పెద్దాపురం, రంపచోడవరం, తుని, అచంట, దెందులూరు, కైకలూరు, నరసాపురం, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, గన్నవరం, జగ్గయ్యపేట, మచిలీపట్నం, మైలవరం, నందిగామ, నూజివీడు, పామర్రు,, పెడన, పెనమలూరు, విజయవాడ వెస్ట్, బాపట్ల, చిలకలూరిపేట, గురజాల, వినుకొండ, మాచర్ల, రేపల్లె,తాడికొండ, తెనాలి, వేమూరు, దర్శి,అద్దంకి, పర్చూరు, కందుకూరు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, ఎర్రగొండపాలెం, ఒంగోలు,ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి, చిత్తూరు, మదనపల్లె, నగరి, పీలేరు,తంబళ్లపల్లె, జమ్మలమడుగు, కడప,కమలాపురం,, మైదుకూరు, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటి, ధర్మవరం, కదిరి, కళ్యాణదుర్గం, మడకశిర, పెనుకొండ,పుట్టపర్తి, రాప్తాడు, రాయదుర్గం, తాడిపత్రి,డోన్, కర్నూలు, మంత్రాలయం, నందికొట్కూరు, నంద్యాల,పత్తికొండ, శ్రీశైలం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలు ఉన్నాయి.

**రెడ్ జోన్**

53 నియోజకవర్గాలు నిలిచాయి. నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళం, చీపురుపల్లి, పార్వతీపురం, పాలకొండ, అరకు, మాడుగుల,పాడేరు, విశాఖ సౌత్, ఎలమంచిలి, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, గన్నవరం, రాజానగరం, రామచంద్రపురం, రాజోలు, భీమవరం, చింతలపూడి, కొవ్వూరు, పోలవరం, ఉంగటూరు, అవనిగడ్డ, గుడివాడ, తిరువూరు, గుంటూరు ఈస్ట్, గుంటూరు వెస్ట్, ప్రతిపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, పెదకూరపాడు, చీరాల, సంతనూతలపాడు, గూడూరు, కావలి, ఉదయగిరి, సూళ్లూరుపేట,జీడి నెల్లూరు, పూతలపట్టు, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి, బద్వేలు, రైల్వేకోడూరు, అనంతపురం అర్బన్,సింగనమల, గుంతకల్, ఆదోని, ఆళ్లగడ్డ, ఆలూరు, కోడుమూరు, పాణ్యం ఉన్నాయి.

# ఏపీలో రప్పా.. రప్పా రాజకీయాలు



**విజయవాడ– సూర్యవాస్తవం, జూన్ 21**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రాజకీయాలు ప్రతి రోజూ హీటెక్కుతున్నాయి. ఎన్నికలయి ఏడాది పూర్తి కాక ముందే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలయింది. 2019లో టీడీపీ పార్టీ ఓడిపోయిన ప్పుడు కూడా ఇంతే. ఏడాదిలోనే అప్పుడు కూడా రాజకీయాలు వేడెక్కాయి. ఎన్నికల వరకూ కొనసాగాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తుంది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి పల్నాడు జిల్లా పర్యటనతో మరింత హీటెక్కాయి. రప్పా రప్పా రాజకీయాలు నడుస్తున్నాయి. పుష్ప సినిమాలో డైలాగులు నేరుగా పొలిటికల్ స్క్రీన్‌పై ప్రత్యక్ష్య మవు తున్నాయి. మాటల యుద్ధం మొదలయింది. ఇద్దరు ఎవరికి వారు తగ్గేదిలేదు అన్నట్లుగానే చంద్రబాబు, జగన్ వ్యవహరిస్తు న్నారు. ప్రధా నంగా యువతను ఆకట్టుకునేందుకు ఇలాంటి నినాదాలతో నేతలు ముందుకు వెళుతున్నారా? అన్నఅనుమానం అందిరిలోనూ కలుగు తుంది. జగన్ పల్నాడు జిల్లాలో పర్యటనలో ఇద్దరు మరణించారని, వారి మృతి జగన్ కారణమని టీడీపీ నేతలు అంటున్నారు. అయితే 2024 ఎన్నికలకు ముందు కందుకూరులో,గుంటూరులో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో అమాయకులు మరణించిన విషయాన్ని వైసీపీ నేతలు తమ సోషల్ మీడియా పోస్టుల ద్వారా గుర్తు చేస్తున్నారు. నాడు ఇరుకు సందుల్లో పెట్టి జనం వచ్చారని నమ్మించే ప్రయత్నం చేయబట్టే కందు కూరులో అంత మంది మరణించడానికి కారణమని నాడు అధికారంలో ఉన్న వైసీపీ చెప్పి రాష్ట్రమంతటా సభలు, సమావేశాలపై ఆంక్షలు విధిస్తే, నేడు జగన్ పర్యటనపై ఆంక్షలు విధిస్తూ మూడు వాహనాలకు, వందమందికిమించి వెళ్లడానికి వీలు లేదని చెబుతోంది. మానవతను పెంపొందించే సామూహిక ప్రక్రియ అధికారంలో ఎవరున్నా... నాడు జగన్ అయినా నేడు చంద్రబాబు అయినా ఒకటే లక్ష్యం. సభలకు, సమావేశాలకు, పర్యటనలకు ఎక్కువ మంది జనం వచ్చినట్లు కనపడితే అది సామాన్య ప్రజలపై ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన కట్టడి చేయడానికి కారణమంటున్నారు. ప్రధానంగా ప్రధాన మీడియా మరుగున పడిపోయి సోషల్ మీడియా విస్తృతంగా పెరిగిన నేటి కాలంలో పర్యటనలకు హైప్ రావడం ఇష్టం లేకనే ఇలాంటి అనవసర ఆంక్షలు పెడుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. నాడు జగన్ ఏపీలో రాజకీయ సభలు, సమావేశాలకు ఏకంగా ఒక జీవోను విడుదల చేశారు. దానిపై అప్పట్లో చంద్రబాబు న్యాయపోరాటం చేశారు.నేడు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా అదేరకమైన ఆంక్షలు విధి స్తుండటంతో ఏపీ పాలిటిక్స్ నిజంగానే రప్పా రప్పాగానే నడుస్తున్నా యంటు న్నారు. ఇద్దరిలో ఎవరూ సుద్దపూసలు కాదు. పుణ్యాత్ములు కాదన్నది సామా న్యుల మాటగా వినిపిస్తుంది. ఇక వైసీపీ అధికారంలోకి రాగానే జాతరలో పొట్టేళ్లను నరికినట్లు రప్పారప్పా నరికేస్తామంటూ జగన్ పల్నాడు పర్య టనలో ఫ్లెక్సీలు వెలిశాయి. అయితే ఆ ఫ్లెక్సీపట్టుకుంది గతంలో టీడీపీ కార్యకర్త అని వైసీపీనేతలు చెబు తున్నారు. అసలు రప్పా రప్పా అంటూ పుష్ప సినిమాడైలాగు చెబితే తప్పేంటి.. అడ్డంగా తల అటు ఇటూ ఊపినా కేసులు పెట్టడం కామన్ అయిందని వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యానించారు. ఇదేమి రాజకీయం అంటూ ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కౌంటర్ ఇస్తూ నాయకులకు హుందాతనం ఉండాలని, ఒకవైపు యోగా డే వేడుకలు జరుగుతుంటే మరికొందరు రప్పా రప్పా అంటున్నార న్నాని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు ఊళ్లలో గ్రామ దేవతలకు పొట్టేళ్లను బలి ఇచ్చేటప్పుడు రప్పా రప్పా అనేవారని, ఇష్టానుసారంగా టెర్రరిజం క్రియేట్ చేస్తే ఊరుకోబోమని చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో మొత్తం మీద ఏపీలో రప్పా రప్పా రాజకీయం ఎటువైపు దారి తీస్తుందోచూడాలి.

## పీఈఎస్‌లో అంతర్జాతీయ యోగా డే నిర్వహణ



**కుప్పం - సూర్య వాస్తవం, జూన్ 21:** 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక పిఈఎస్ మెడికల్ కళాశాలలో యోగ ఆంధ్ర కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న 'యోగాంధ్ర-25' లో భాగంగా ఈ కార్యక్రమాన్ని పి ఎస్ మెడికల్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు కళాశాల ఆడిటోరియంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, అలైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సులకు చెందిన అధ్యాపకులు, పరిపాలనా సిబ్బంది, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఈ సంవత్సరం యోగా దినోత్సవం యొక్క థీమ్ ద్వారా "ఒక భూమి - ఒక ఆరోగ్యం" (యోగ ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్" ) అనే నినాదానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పీఎస్ కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా. హెచ్.ఆర్.కృష్ణరావు, మెడికల్ సూపరింటెండెంట్ డా.కె.సుబ్రమణ్యం ఇతర పరిపాలనాధికారులు, విభాగాధిపతులు, హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వారు యోగా యొక్క శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యంపై ఉన్న ప్రభావాన్ని వివరించారు. అనంతరం శిక్షణ పొందిన అధ్యాపకులు, విద్యార్థులచే ప్రత్యేక యోగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధ్యానం, ప్రాణాయామం, విశ్రాంతి అభ్యాసాలు చేశారు. ఈ యోగాలో పాల్గొన్నవారు. క్రమశిక్షణ, ఉత్సాహం, ఐక్యతను ప్రదర్శించారు. ఇది సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రతిబింబించేలా కనిపించింది. అనంతరం పిఈఎస్ మెడికల్ కళాశాలడీన్, ప్రిన్సిపాల్ డా. హెచ్.ఆర్.కృష్ణరావు ఈ సందర్భంగా వైద్య కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యోగ అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు, అది శరీరాన్ని, మనస్సును, ఆత్మను సమన్వయంగా కలిపే జీవనశైలి అని అన్నారు. భవిష్యత్ వైద్యులుగా మీరు యోగాలోని నివారణ, చికిత్సాత్మక విలువలను అర్థం చేసుకుని ఆచరణలో పెట్టాలని వారికి సూచించారు. ఆరోగ్యంగా జీవించడానికీ, మరొకరికి మంచి ఆరోగ్యాన్ని అందించడానికీ యోగా కీలకం అని తెలిపారు. అనంతరం యోగా యొక్క శాంతి, ఐక్యత, ఆరోగ్య సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

## ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూసేలా చేశారు

**- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రసంగం స్ఫూర్తి నింపింది**
**- యోగాతో గిన్నీస్ బుక్ రికార్డ్ సాధించడం ఆనందంగా ఉంది**
**- విశాఖలో జరిగిన యోగాంధ్రలో ఎమ్మెల్యే దగ్గుపాటి**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 21:** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచం మొత్తం విశాఖపట్నం వైపు చూసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చేశారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం విశాఖలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తోటి ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి యోగా చేశారు. ట్రైనర్స్ చెప్పినట్టుగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాకున్న ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి తెలియజెప్పారన్నారు. యోగా డేను 130 దేశాల్లో జరుపుకోవడం మామూలు విషయం కాదన్నారు. యోగాతో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రసంగాలు అందరిలో స్ఫూర్తి నింపాయన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మంత్రి నారా లోకేష్ పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రధాని మోదీ ఆయన్ని ప్రసంశించడం మంత్రి లోకేష్ పనితీరుకు నిదర్శనమన్నారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని అందుకే ప్రధాని మోదీ గత పదేళ్లుగా యోగాను ప్రోత్సహిస్తున్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ప్రజలు ప్రతి రోజు యోగా చేసే విధంగా అవగాహన కల్పించడంతో పాటు.. ఇందుకోసం కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ నజీర్

**- ఆటోలో మరచిపోయిన విలువైన బ్యాగును బాధితుడికి అప్పగింత**



**గుత్తి - సూర్య వాస్తవం, జూన్ 21:** ఆటోలో ప్రయాణించిన కుడేరు మండలం కదరకుంట గ్రామానికి చెందిన నాగరాజు పొరపాటున వదిలేసిన బ్యాగును తిరిగి తీసుకువెళ్లి అప్పగించడం ద్వారా ఆటో డ్రైవర్ నజీర్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఈ ఘటన గుత్తిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... శనివారం నాడు నాగరాజు గుత్తి బస్టాండ్ నుండి శాలకు వెళ్లడానికి ఆటో ఎక్కాడు . ఆటోలో ప్రయాణించి తన బ్యాగును అందులో విలువైన వస్తువులు, డబ్బులు, మొబైల్ ఫోన్ మరచిపోయారు. విషయం గమనించిన ఆటో డ్రైవర్ నజీర్ వెంటనే నాగరాజు ఎక్కడున్నాడో కనుక్కొని బ్యాగును బాధితుడికి అందజేశారు.తన విలువైన వస్తువులు లభించడంతో ఆటో డ్రైవర్ నజీర్ కు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీగా బ్యాగును అప్పజెప్పిన ఆటో డ్రైవరును గుత్తి వాసులు అభినందించారు. సమాజ సేవలోనూ ముందే..! గర్భిణీ మహిళలకు ఉచిత ఆటో రవాణాతో మానవత్వం చాటుతున్నడు నజీర్.గుత్తి లో గర్భిణీ మహిళలకు ఉచిత ఆటో రవాణా సౌకర్యం అంటూ సేవ దృక్పథంతో, మానవత్వంతో సమాజ సేవలో నేను సైతం అంటూ నజీర్ ఎప్పటి నుండో గర్భిణీ స్త్రీలకు ఉచితంగా రవాణా చేస్తూ ఉన్నారు.

# యువత పోరును విజయవంతం చేయాలి

**- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపు**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 21:** నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈనెల 23వ తేదీన అనంతపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించే 'యువత పోరు' ధర్నాను విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 'యువత పోరు' పోస్టర్లు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా అనంత వెంకటరామిరెడ్డి హాజరై దిశానిర్దేశం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి యువజన విభాగం ఎంతో కీలకమని అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గురించే ఆలోచిస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు మోసానికి గురవుతున్నారన్నారు.


నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 23వ తేదీన అనంతపురం కలెక్టరేట్ ఎదుట యువజన విభాగం ఆధ్వ ర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్య క్రమంలో యువతను భాగస్వామ్యం చేసుకుని విజయవంతం చేయాల న్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని అనంత మండిపడ్డారు. కేసులకు ఎవరూ భయపడొద్దని సూచించారు. ప్రజల పక్షాన పోరాట చేయాలని యువజన విభాగం నేతలకు సూచించారు.

**హామీల అమలుకు యువజన విభాగం పోరాటం:** రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం వైసీపీ యువజన విభాగం పోరాటం చేస్తుందని యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తెలిపారు. ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, లేని పక్షంలో నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారన్నారు. ఏటా జనవరి 1వ తేదీనే జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. ఏడాది గడిచినా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, ఒక్కరికీ నిరుద్యోగ భృతి అందకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా పీకేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో 6800 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక నోటిఫికేషన్ రద్దు చేశారన్నారు. మెగా డీఎస్సీ పేరుతో చంద్రబాబు, లోకేష్ తొలి సంతకాలు చేసినా ఇప్పటికీ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి 1.25 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎండీయూ ఆపరేటర్లు, ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసే సూపర్‌వైజర్, సేల్స్ మన్లను తొలగించి యువతను నిరుద్యోగులుగా మార్చారన్నారు.

**బాబుగారూ..బటన్ నొక్కలేకపోతున్నారా :** వైఎస్ జగన్ హయాంలో సంక్షేమ పథకాలను అందిస్తే ముసలోడు కూడా బటన్ నొక్కుతాడు అని చంద్రబాబు అవహేళన చేశారు. ఈ రోజు అదే ముసలోడిని అడుగుతున్నాం. బటన్ సరిగ్గా నొక్కలేకపోతున్నారా? మా ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశాం. ఇప్పుడు తల్లికి వందనం అని పేరు మార్చారు. రాష్ట్రంలో 60 లక్షల మందికి పైగా లబ్ధిదారులుంటే కేవలం 30 లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం అందించారు. వైఎస్ జగన్ అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి తల్లులకు రూ.13 వేలు అందించారు. రూ.2 వేలను స్కూళ్ల అభివృద్ధికి కేటాయించి నాడు - నేడు ద్వారా అభివృద్ధి చేశారు. అప్పట్లో చంద్రబాబు, లోకేష్, కూటమి నేతలంతా అమ్మ ఒడిలో రూ.2 వేలు జగన్ కోత పెట్టాడని విమర్శించారు. ఆ డబ్బు జగన్ జేబులోకి వెళ్తోందని అన్నారు. అప్పట్లో మీరు తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తామని, కోతలుండవని హామీ ఇచ్చారు. కానీ నేడు జరుగుతోంది ఏంటి? రూ.15 వేలలో రూ.2 వేలు కోత పెట్టారు. ఇప్పుడు మీ అమ్మ మొగుడి జేబులోకి వెళ్తోందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటం చేస్తాం" అని సాకే చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈనెల 23వ తేదీన యువజన విభాగం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. యువజన విభాగం నాయకులు, కార్యకర్తలంతా 'యువత పోరు'ను విజయవంతం చేయాలన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నగర అధ్యక్షుడు శ్రీనివాస్ దత్త, ఉపాధ్యక్షుడు ఉదయ్, ప్రధాన కార్యదర్శి హిదాయతుల్లా, యువజన విభాగం నాయకులు మైను, సోహైల్, సాయికృష్ణ, బాలిరెడ్డి, కుమార్, జగదీష్, వేణు, బాబా తదితరులు పాల్గొన్నారు.

# లేపాక్షి కళా శిల్పాలు ఎంతో అద్భుతం అపురూపం

**- లేపాక్షి లో వీరభద్ర స్వామి దేవాలయాన్ని సందర్శించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**
**- మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**






**లేపాక్షి - సూర్య వాస్తవం, జూన్ 21:** ఎంతో ప్రసిద్ధిగాంచిన లేపాక్షి ఆలయ కళా శిల్పాలు చాల అద్భుతంగా ఉన్నాయని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. హిందూపురంలోని ఏం జీ ఏం మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ 11 వ యోగ దినోత్సవ కార్యక్రమాన్ని హాజరై వాటిని ముగించుకొన్న తర్వాత మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నేరుగా లేపాక్షికి వీరభద్ర స్వామి దేవాలయానికి విచ్చేశారు. అక్కడికి విచ్చేసిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి ఆలయ పూజారులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే మాజీ మంత్రికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ దేవాలయంలో నిర్మించిన లేపాక్షి వీరభద్ర ఆలయ అద్భుత కట్టడాలు శిల్పాలు వాటి యొక్క వివరాలు, ఆలయ ప్రతిష్ట విశేషాలను చరిత్రకారుడు రఘురామ ద్వారా ఎమ్మెల్యే, మాజీ మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో లేపాక్షి కి ఎంతో ప్రసిద్ధి ఉందనీ భవిష్యత్తులో మంచి పర్యాటక రంగంగా ఈ ప్రాంతం నిలిచిపోతుందని అన్నారు. దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఈ లేపాక్షి ఆలయానికి విచ్చేస్తుంటారని ప్రధానంగా పర్యాటకులకు ఎంతో చూడదగ్గ ప్రాంతమన్నారు. ముఖ్యంగా ఈ ఆలయంలో ప్రత్యేకంగా ఏడు పడగల నాగుపాము, సీతాదేవి అడుగు, రావణాసురుడు, ఆంజనేయులు, ఈశ్వరుడు పార్వతి దేవి, శ్రీకాళహస్తి చరిత్ర, విరూపాన్న, దుర్గాదేవి, రఘురామ స్వామి, ఏనుగు, అర్ధాంతరంగా నిలిచి పోయిన మండపం, జటాయువు, అతి పెద్ద నంది విగ్రహాలు పర్యాటకులకు ఇవి ప్రత్యేక 8ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఈ దేవాలయంలో భూమిని తాకకుండా ఏర్పడిన స్థంభం ప్రతి ఒక్కరిని అబ్బురపరిచేలా ఆనాటి నిర్మాణ కారులు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇంకా ఎన్నో అద్భుతమైన శిల్పాలు ఎంతో అందంగా ఆనాటి చిత్రకారులు ప్రజలకు కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారని కొనియాడారు. దేశంలోని లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, అందుకే ఇక్కడికి మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు తో పాటు దేశ విదేశాల నుంచి ఎంతోమంది గొప్ప ప్రముఖ వ్యక్తులు ఇక్కడికి విచ్చేసి ఆలయ ప్రతిష్టను వాటి విశేషాలను క్షుణ్ణంగా తెలుసుకొని ఆచరిస్తుంటారని పేర్కొన్నారు. అనంతరం అతి పెద్ద నంది విగ్రహాన్ని సందర్శించారు. దేవాలయం వద్ద వీరభద్ర స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ నిర్వహకులు రాంప్రసాద్ ట్రస్ట్ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సందర్శించి అక్కడే అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి పార్టీల నాయకులు ,ఆలయ ట్రస్టు సభ్యులు రాంప్రసాద్ ఆనంద్, సప్తగిరి కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యోగాను ప్రజా బాహుళ్యంలోకి విస్తృతంగా తీసుకెళదాం

**- ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకుందాం**
**- ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ సూచన**



**రాయదుర్గం - సూర్య వాస్తవం, జూన్ 21:** ప్రజా బాహుళ్యంలోకి యోగాను విస్తృతంగా తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు సూచించారు. ఆరోగ్యవంతమైన జీవన విధానానికి యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాయదుర్గం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో శనివారం సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా యోగాకు విస్తృత ప్రచారానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. విశాఖ నగరంలో మోడీ సమక్షంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వాహణలో చరిత్ర సృష్టించారన్నారు. ఒకే సారి లక్షల మందితో సామూహిక యోగా చేయించి గిన్నీస్ బుక్ రికార్డు సాధించటం చాలా గొప్ప విషయమన్నారు. యోగాను విస్తృతంగా మరింత ముందుకు తీసుకెళ్లడానికి దోహదపడుతుందని తాను బలంగా నమ్ముతున్నానన్నారు. యోగాతో మనిషి శారీరకంగా ఆరోగ్యంగా దృఢంగా ఉండటంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. తాను స్వతహాగా యోగా చేసిన తరువాత పొందిన అనుభూతి గురించే చెపుతున్నానన్నారు. మానసికంగా మంచి ఆలోచనలు వస్తాయన్నారు. ఉదయం నుండి రాత్రి పడుకొనే వరకు శరీరం ఒకే విధమైన యాక్టివ్ గా ఉంటుందన్నారు. సానుకూల ఆలోచనలతో ఇతరులు మనతోపాటు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలనే భావన పెరుగుతుందన్నారు. ఇతరుల పట్ల ఈర్ష్య ద్వేషాలకి అతీతంగా మనిషి జీవించగలుగుతారని పేర్కొన్నారు. ఎదుటివారు కష్టాలు, సుఖాలో పాలు పంచుకోవాలనే గొప్ప అనుభూతి కలుగుతుందన్నారు. ఇంతటి మానసిక ప్రశాంతత, సానుకూల ఆలోచనలు మరేందులోనూ అగు పించవ న్నారు. నేటి సమాజంలో రోజు రోజుకు మానసిక వత్తిళ్లు, సమస్యలు అధికమవుతున్నాయన్నారు. అతి చిన్న సమస్యను పెద్దదిగా ఊహించుకొంటూ నిత్యం దాంతో సతమతమవడం జరుగుతోందన్నారు. అలాగే పెరుగుతున్న గాలి, నీరు, వాతావరణ, ఆహార కాలుష్యంతో అనేక జబ్బులు, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. వీటన్నిటిని సమర్ధవంతంగా ఎదుర్కొంటూ మనల్ని మనం చక్కగా తీర్చి దిద్దుకోటానికి అనునిత్యం యోగా కీలకపాత్ర వహిస్తుందన్నారు. ఇప్పటికే చాలా మంది యోగాను దినచర్యలో భాగం చేసుకొన్నారని తెలియచేసారు. ప్రజల్లో క్రమంగా అవగాహన పెరుగుతుండటం శుభపరిణామ మన్నారు. యోగాను నిత్యం తాము ఆచరించటంతో పాటు మరింత వేగంగా ప్రజా బాహుళ్యం లోకి తీసుకెళ్ళతామని ప్రతి ఒక్కరితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

## యోగాంధ్రలో ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్టు



**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 21:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగేంద్ర-2025 రికార్డ్ సృష్టించింది. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ దగ్గర ఉన్న ప్రభుత్వ కళాశాల మైదానంలో 5000 మందితో యోగేంద్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి తాహసిల్దార్ నరసింహ కుమార్, మున్సిపల్ కమిషనర్ వాసు ,అధికారులు అనధికారులు పాల్గొన్న కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు, నటుడు, రచయిత, దర్శకుడు, ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్ ఎస్.జైనుల్లా ఆబెద్దీన్ బాష (అభినయ్) పాల్గొని యోగా చేశారు. కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా భారతీయ సంప్రదాయం మాత్రమే కాదు. అంతర్జాతీయ స్థాయిలో ఆరోగ్య సాధనగా, జీవనశైలిగా మారిందని అన్నారు.ప్రపంచం అంతటా కోట్లాది మంది జీవితాల్లో భాగమైందని ఆయన అన్నారు.

## డిఎస్పీని ఆశ్రయించిన ప్రేమ జంట



**మదనపల్లె - సూర్య వాస్తవం, జూన్ 21:** పెద్దల నుంచి ప్రాణహాని ఉంది. రక్షణ కల్పించాలని శనివారం ఓ ప్రేమ జంట మదనపల్లి డిఎస్పి మహేంద్రను ఆశ్రయించారు. అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లె నియోజకవర్గం, పెద్ద మండెం మండలం, బండ్రేవుకు దళిత వాడకు చెందిన అంజి అయ్యప్ప(23), సత్యసాయి జిల్లా, నల్లచెరువుకు చెందిన బి.భాగ్యలక్ష్మి (19) గత కొంత కాలంగా ఒకరి నొకరు ప్రేమించు కుంటున్నారు. ఒకే కులమైన తమ ప్రేమను పెద్దలు ఇష్ట పడలేదని తెలిపారు. ఇద్దరు మేజర్లు కావడంతో ఇంటి నుండి వెళ్ళి పోయి ప్రేమ వివాహం చేసుకున్నా మన్నారు. తమకు పెద్దల నుంచి ప్రాణ హాని ఉంది, రక్షణ కల్పించాలని మదనపల్లె డిఎస్పీ మహీంద్రను అశ్రయించగా వారు ఆ జంటకు రక్షణ కల్పించారు.

## జీవన శైలిలో అనేక మార్పులు యోగాతోనే సాధ్యమవుతుంది



**కదిరి - సూర్య వాస్తవం, జూన్ 21:** యోగాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు నంబుల పూల కుంట మండల కేంద్రం, తిమ్మమ్మ మర్రిమాను ఆవరణంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ వేకువ జామునే యోగ కార్యక్రమాన్ని ఉత్సాహంగా, ఉల్లాసంగా ప్రారంభించారు, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు, స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రతి దినం యోగ ను ఆచరించడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించే విధంగా జీవన విధానంలో మార్పులు అవలంబిస్తాయని వాటి ద్వారా శరీరం, మనసు, ధ్యానం, ఆరోగ్య, శాంతి లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి స్వచ్ఛందంగా విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్ పి కుంట మండల పరిధిలోని జౌకల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమం లో భాగంగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు ఆదేశాల మేరకు విద్యార్థిని, విద్యార్థులు యోగా కార్యక్రమాన్ని నిర్వహించి జయప్రదం చేశారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుని, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో అదుపుతప్పిన ద్విచక్ర వాహనదారుడు



**సిద్ధవటం - సూర్య వాస్తవం, జూన్ 21:** మండల కేంద్రమైన సిద్ధవటం హై లెవెల్ వంతెన పై శనివారం సాయంత్రం కడప నుండి బద్వేలు సమీప ప్రాంతంలో ఉన్న కుమ్మరి కొట్టాలు గ్రామానికి వెళుతుండగా మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపుతప్పి గురు ప్రసాద్ అనే వ్యక్తి క్రింద పడడంతో గాయాలయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న ఎస్సై మహమ్మద్ రఫీ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## మొక్కలు నాటాలి పర్యావరణాన్ని కాపాడాలి

**- యోగాతో ఆరోగ్యం మెరుగు : సిద్ధవటం రేంజర్ బి కళావతి**



**సిద్దవటం - సూర్య వాస్తవం, జూన్ 21:** మొక్కలు నాటాలి పర్యావరణాన్ని కాపాడాలని సిద్దవటం రేంజర్ బి కళావతి పిలుపునిచ్చారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సిద్ధవటం అటవీశాఖ కార్యాలయంలో శనివారం సిద్ధవటం రేంజ్ అటవీశాఖ సిబ్బంది యోగ కార్యక్రమం నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయంలో మొక్కలు నాటి ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైనందిక జీవితంలో యోగాను చేస్తూ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఆరోగ్యం మెరుగు పరుచుకునేందుకు ప్రతి ఒక్కరికీ యోగా అవసరమన్నారు. అడవి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలకి అనుమానస్పదంగా ఎవరైనా అనిపిస్తే వెంటనే అటవీ శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఎర్రచందనం పరిరక్షణకు కృషిచేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కే ఓబులేష్, సెక్షన్ ఆఫీసర్ సురేష్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కుప్పంలో విజయవంతంగా యోగాంధ్ర

**- యోగాంధ్ర ని విజయవంతం చేసిన కడ అధికారులు**

**- ప్రపంచానికి భారతదేశం యోగాలో ఆదర్శంగా నిలుస్తుంది**







**కుప్పం - సూర్య వాస్తవం, జూన్ 21:** కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా నిర్వహించిన “యోగాంధ్ర” కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ మహా కార్యక్రమంలో 5,000 మందికి పైగా ప్రజలు పాల్గొని యోగా ప్రాముఖ్యతను పంచుకున్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించేందుకు, ప్రజల్లో యోగామీద అవగాహన పెంచే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి.ఈ సందర్భంగా కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ దిగ్వి జయంగా సాగేందుకు ముందస్తుగా చర్యలు తీసుకున్నట్టు తన సన్నిహితులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి తనకు ఫోన్ ద్వారా కుప్పంలో, ఆంధ్రప్రదేశ్ లో గిన్నిస్ రికార్డు సృష్టించే దిశగా యోగా కార్యక్రమం నిర్వహించడం అభినందించదగ్గ విషయ మని తెలిపారని అన్నారు. ధ్యానం యోగా ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోగలుగు తామని ఉద్యోగులు విద్యార్థులు ప్రజలు తమ దైనందిన ఒత్తిడి జీవితాన్ని నిర్వహిస్తుంటే దాని నుండి ఉపశమనానికి ఈ యోగా ఆసనాలు ఎంతో ఉపయో గకరంగా ఉంటుందని అన్నారు. అంతకుముందు యోగా కార్యక్రమాన్ని కడపిడి వికాస్ మర్మత్ ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.ఎస్ మునిరత్నం, అధికారులు నేతల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన గావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలతో మొదలై ఐదువేల మందితో యోగాసనాలను వేయించిన యోగా గురువులు వాటి ప్రాశస్త్యం గురించి తెలియజేశారు.కాగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.తేజశ్రీని కడ పిడి వికాస్ మర్మత్ దుశ్శాలువ కప్పి అభినందించారు. ఈ సందర్భంగా కడ పిడి మాట్లాడుతూ చిన్నారి తేజశ్రీ కుప్పం పరిధిలోని జయప్రకాశ్ రోడ్డు నందు నివాసముంటున్న శ్యామల, కృష్ణంరాజుల కుమార్తె అని తెలిపారు. చిన్నతనం నుండి యోగా పట్ల ఆసక్తిపెంచు కొని ఉత్తమప్రతిభ కనపరిచినందున రాష్ట్రస్థాయి పోటీలకు చిన్నారి ఎంపికైందని పేర్కొన్నారు.

యోగా ను నిత్య జీవితంలో ఒక భాగంగా మార్చుకుని నిరంతర సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి యోగ పోటీలకు శిక్షణ ఇచ్చిన శ్రీ కళాక్షేత్రం యోగా మాస్టర్ బి పవిత్ర ఎం.ఎస్,సి ని పలువురు అభినందించారు. “యోగం అనేది కేవలం వ్యాయామం కాదని ఇది శరీరానికి, మనస్సుకు, ఆత్మకు శాంతిని చేకూర్చే మార్గమని అన్నారు. కుప్పం ప్రజల ఆరోగ్యం కోసం ఇటువంటి విస్తృత స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణమని తెలిపారు.ప్రజల ఆరోగ్యం, ఫిట్‌నెస్, సామాజిక చైతన్యం కోసం కడ ఈ తరహా కార్యక్రమాలను కొనసాగిస్తుందని కడా పిడి తెలిపారు. గత పది పదిహేను రోజులుగా యోగాసనాలపై అవగాహన కల్పించేందుకు కుప్పం మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు చేస్తున్న కృషిని నేతలు అధికారులు అభినందించారు. చివరగా యోగా ఆసనాలకు సంబంధించి ఓ పుస్తకాన్ని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాసరాజు, ఆర్టిఏ జాయింట్ కమిషనర్ క్రిషణవేణి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, నేతలు పి.గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, జిమ్ దాము, జాకీర్ అహ్మద్, సోము, మాజీ జెడ్పిటిసి పి సాంబశివం, ఆర్.ఆర్. రవి,అంబామహేష్, అధికారులు డిఎస్పి బి. పార్థసారథి, ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు, సిరికళాక్షేత్రం స్థాపకురాలు సునీత మహేష్, మున్సిపల్ అధికారులు, కుప్పం మండల వైద్యాధికారులు దీప్ కుమార్, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, కుప్పంమండల యోగా గురువులు గణేష్,ఏకాంబరం, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# రాయచోటిలో విజయవంతంగా యోగా నిర్వహణ

**- యోగాను జిల్లా ప్రజలందరూ ప్రతిరోజు అభ్యసించి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలి**

**- అన్నమయ్య జిల్లాను యోగాంధ్రలో మొదటి స్థానంలో నిలిపిన జిల్లా ప్రజలకు అభినందనలు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూన్ 21:** యోగాను జిల్లా ప్రజలందరూ ప్రతిరోజు అభ్యసించి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని, అన్నమయ్య జిల్లాను యోగాంధ్ర కార్యక్రమంలోని వివిధ అంశాలలో మొదటి స్థానంలో నిలిపిన జిల్లా ప్రజలకు అభినందనలు తెలిపారు. జూన్ 21 న 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నందు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి నాయకత్వంలో 5000 మంది తో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ.... అన్నమయ్య జిల్లా రాయచోటిలో 5000 మంది తో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 8 లక్షల మందితో 5050 ప్రాంతాల్లో యోగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో గౌరవ ప్రధానమంత్రి మరియు గౌరవ ముఖ్యమంత్రి గార్ల ఆధ్వర్యంలో ప్రత్యక్షంగా 05 లక్షల మందితో రాష్ట్రవ్యాప్తంగా 02 కోట్ల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లా ప్రజలందరూ ఈ యోగా కార్యక్రమంలో అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. అన్నమయ్య జిల్లాను యోగాంధ్ర కార్యక్రమంలోని యోగా శిక్షణలు, యోగా కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ల పంపిణీ తదితర, అంశాలలో మొదటి స్థానంలో నిలిపిన జిల్లా ప్రజలకు అభినందనలు తెలిపారు. మే 21 నుండి జూన్ 21 వరకు జరిగిన యోగా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని జిల్లా ప్రజలందరూ యోగాను ప్రతిరోజు అభ్యసించి మానసికంగా శారీరకంగా ఆధ్యాత్మికంగా పరిణితి చెందాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ.... అన్నమయ్య జిల్లాలో మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో కృషిచేసిన జిల్లా అధికారులకు, ఎంపీడీవోలకు ముఖ్యంగా రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, పిడిడిఆర్డిఏ సత్యనారాయణ, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం లను ప్రత్యేకంగా అభినందించారు. అత్యంత ఉత్సాహంతో నెలరోజులుగా యోగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి, యోగాని ప్రజల జీవితంలో భాగస్వామ్యం చేసి శరీరక మానసిక ఆధ్యాత్మిక పరిణితి సాధించేందుకు కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముందుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో “వన్ నేషన్ వన్ హెల్త్” అనే థీమ్తో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రారంభ వేడుకల లైవ్ వీడియోను జిల్లా ప్రజలకు ఎల్ ఈ డి స్క్రీన్ ద్వారా అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తాసిల్దార్ నరసింహా కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, పిడి డిఆర్ డిఏ సత్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, టిడిపి, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పేదవానికి అందని ద్రాక్షలా మెడికల్ విద్య

**- 17 మెడికల్ కళాశాలలు 66 సంవత్సరాలు లీజుకి ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలి**

**- అణగారిన వర్గాలు చదువుకోవడానికి అడ్డుగా ఉన్న 107, 108 జీవోలను రద్దు చేయాలి**

**- పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ధర్నా**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 21:** అనంతపురం మెడికల్ కళాశాల వద్ద పి డి ఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.... గత ప్రభుత్వం రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటుకు జాతీయ వైద్య మండలి అనుమతితో నిధులు సమకూర్చింది, ఈ కళాశాలను ఏర్పాటు చేసేటప్పుడు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థుల కు దూరం చేసే విధంగా 107 108 జీవోను తీసుకొచ్చాయని, మా ప్రభుత్వం వైద్య విద్యార్థులకు అండగా నిలుస్తుందని లోకేష్ బాబు తన యువగలం పాదయాత్రలో వైద్య విద్యార్థులందరికీ సమాన విద్యను అందిస్తామని ఉచిత విద్యను అందిస్తామని ప్రతి విద్యార్థికి న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం తీసుకొచ్చిన 17 వైద్య కళాశాలలకు సంబంధించి 1800 మెడికల్ సీట్లు రద్దు చేయమని కూటమి ప్రభుత్వం జాతీయ మెడికల్ కౌన్సిల్ లకు లేఖ రాయడం చాలా దుర్మార్గం 80 శాతం నిర్మాణం పూర్తి చేసుకొని ఎంబీబీఎస్ తరగతులు నిర్వహించుటకు సిద్ధంగా ఉన్నాయి ఆ కళాశాలలను 66 సంవత్సరాలు లీజుకు ఇచ్చే విధంగా పి4 విధానాన్ని తీసుకువచ్చి వైద్య విద్యను కూటమి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు పూర్తిగా దూరం చేయడమే అవుతుంది దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి వెంటనే పి ఫోర్ విధానాన్ని రద్దు చేయాలి. 107 108 జీవోలను రద్దు చేయాలి. కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాన్ని రద్దు చేసి 17 వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పిడిఎస్యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని అని తెలియజేస్తూ, ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా కోశాధికారి బండారు శంకర్, జిల్లా కమిటీ సభ్యులు కే ఉదయ బాబు, ప్రసాద్, తేజ, శ్రీ వర్ధన్, శ్రీహరి కేశవ్, తేజ, పాల్గొన్నారు.



## ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలు పోస్టర్స్ ఆవిష్కరణ

**రాయచోటి-సూర్య వాస్తవం, జూన్ 21:** రాయచోటి పట్టణంలో ఎస్.ఎఫ్.ఐ అఖిలభారత మహాసభలు పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి మాట్లాడుతూ జాతీయోద్యమ స్ఫూర్తి, అమరవీరుల వారసత్వంతో భారత విద్యార్థి ఫెడరేషన్ అధ్యయనం- పోరాటం నినాదంతో కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో 1970లో ఏర్పడిందన్నారు. స్వాతం త్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యంగా అలుపెరుగని పోరాట ప్రయాణంలో 55 వసంతాలు పూర్తి చేసుకుంది. దేశంలోనే 50 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఉందని చెప్పారు. అందరికీ విద్య-ఉపాధి అందాలని కోరుతున్నది. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణకై జూన్ 27 నుండి 30 వ తేదీ వరకూ ఉద్యమాల గడ్డ కేరళలో ఎస్.ఎఫ్.ఐ. అఖిల భారత మహాసభలు జరుగుతు న్నాయి ఆయన అన్నారు.ఈ పోస్టర్ ఆవిష్కరనా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, ఎస్ఎఫ్ఐ నాయకులు బన్నీ, గణేష్, రాజేష్, సాయి, సమీర్, హరికృష్ణ, కిషోర్ చౌదరి, రెడ్డి కృష్ణ, హరి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అంతర్జాతీయ 11యోగా దినోత్సవం






**హిందూపురం -సూర్య వాస్తవం, జూన్ 21:** హిందూపురం శాసన సభ్యులు పద్మభూషణ్ శ్రీ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం హిందూపురం ఎంజీఎం క్రీడా మైదానంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ ఆద్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి యోగా కార్యక్రమంను ప్రారంభించి, ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన యోగా పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికేట్లు మరియు మెమెంటోలు ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ , పుట్టపర్తి ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి , జిల్లా ఎస్పీ రత్నా ,పురం మున్సిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్ , మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, వీరయ్య, డిఆర్డిఏ నరసయ్య, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఆర్డిఓ ఆనంద్ కుమార్, తహసిల్దార్ వెంకటేష్, డి సి హెచ్ ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, యోగా సెంటర్ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి గ్రామ కమిటీలు సిద్ధం

### - కన్వీనర్ శ్రీరాములు



**రాప్తాడు-సూర్య వాస్తవం, జూన్ 21:** టిడిపి పార్టీ కోసం అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో స్థానం కల్పిస్తున్నామని రాప్తాడు మండల ఎన్నికల పరిశీలకులు పెనుకొండ కన్వీనర్ శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. రాప్తాడు తెదేపా కార్యాలయంలో రాప్తాడు మండల కన్వీనర్ కొండప్ప ఆధ్వర్యంలో మండల గ్రామ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ టిడిపి సంస్థాగత ఎన్నికలలో భాగంగా గ్రామ పార్టీ అధ్యక్షులను యూనిట్ ఇన్ చార్జులను కమిటీ సభ్యులను నియమించామన్నారు. 2024 ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ లో భాగంగా పింఛన్లు పెంపు డిఎస్సీ నోటిఫికేషన్ ఉచిత గ్యాస్ సిలిండర్లు వచ్చే నెల నుంచి రైతు సుఖీభవ పథకం ద్వారా రైతులకు నగదు బదిలీ ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలను మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారు అని అన్నారు. అదేవిధంగా రాప్తాడు నియోజకవర్గం లో శాసనసభ్యులు మాజీ పరిటాల సునీత చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాప్తాడు మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు క్లస్టర్ రాము సర్పంచులు శీనయ్య బాబయ్య ఉజ్జినప్ప యూనిట్ ఇన్ చార్జి నారాయణ స్వామి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామాంజినమ్మ నాయకులు పి.శ్రీనివాసులు బి.నంజుండ కె.నంజుండ గ్రామ పార్టీ అధ్యక్షులు కమిటీ సభ్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మితిమీరితున్న అగ్రవర్ణాల దాడులు

**- బలైపోతున్న దళితులు**
**- శుకానందం పొందుతున్న అగ్రవర్ణాలు**

**తాడిపత్రి-సూర్యవాస్తవం,జూన్21:** సింగనమల నియో జకవర్గం మార్పుల మండలం దుర్గమ్మ గ్రామంలో మాదిగ చంద్ర పై బోయ కులస్తులు తీవ్రంగా దాడి చేశారు.7వేలు అప్పు తీర్చలేదని మాదిగ చంద్రపై బోయ కులానికి చెందిన రమేష్ బోయ అఖిల్ బోయ అనిల్ ఇంకా ముగ్గురు కలసి దాడి చేశారని బాధితుడు మాదిగ చంద్ర ఆవేదన వ్యక్తం చేశారు కట్టెలతోను. రార్డులతోనూ. విచక్షణారహితంగాబాధడంతో మాదిగ చంద్ర సోమ్మసిల్లి పడి పోవడంతో చనిపోయాడని వదిలి వెళ్ళినారని ఎడమ చేయి విరిగినది. చెవ్వుకు గాయం తగిలి 12 కుట్లు పడినాయి. ఇంటి మీదికి కూడా దాడి చేయడానికి ప్రయత్నించడం జరిగినదని గ్రామస్థులు అడ్డుకోవడంతో వెనక్కు వెళ్లిపోయారని ఎవరు లేకుంటే కచ్చితంగా చంపే వారని మాదిగ చంద్ర తెలిపారు గాయపడిన వ్యక్తిఏడు రోజులు అవుతున్న ముద్దా



యిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కానీ అటెం టు మర్డర్ కేస్ కానీ నమోదు చేయకుండా.పంచాయతీరాజి పేర్లతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు 15వ తేది కుప్పం నియోజకవర్గంలో ఎలాగైతే దాడి చేశారో అలాగని దాడి చేసినట్టు దుర్గం గ్రామస్తులు చెబుతున్నారు, కేసులు కట్టకపోవడంతో నార్పల మండలంలో ఈ మధ్యకాలంలో దాడులు దళితులపైన అధిక మవుతున్నాయని ఇంటలిజెంట్ పోలీస్ అధికారులు కూడా ఇలాంటి విషయాలలో పై అధికారులకు తెలిపే విషయాన్ని పై విఫలమైనారని తెలియజేస్తున్నాం. వెలుగులోకి రానివి కోకో నలుగా నార్పల మండలంలో జరుగుతున్నాయని ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల చిన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అధికంగా సింగనమల నియోజ కవర్గంలో దళితులపైన దళిత నాయకుల పైన దాడి చేసిన ప్పటికీ ఆధారాలతో పాటు వీడియోల రూపంలో ఉన్నప్పటికీ కేసులు కట్టకుండా పంచాయతీలు చేసి రాజీ కమ్మ ని ఒత్తిడి చేస్తున్నారని పోలీసుల నిర్లక్ష్యానికి దళితులు చనిపో వాల్సిందేనా ఇప్పటికైనా జిల్లా ఎస్పీ.స్పందించాలని తెలియ జేస్తున్నామని దీన్ని ఎస్సి సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల చిన్న డిమాండ్ చేశారు.

# ఘనంగా యోగాంధ్ర దినోత్సవం

**గుత్తి -సూర్య వాస్తవం ,జూన్ 21:** గుత్తి పట్టణం - భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గుత్తి మునిసిపాలిటీలో యోగాంధ్ర-ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమం, స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ హరితాంధ్ర కార్యక్రమాలు నిర్వ హించారు. మునిసిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా, ఎం.ఈ.ఓ రవినాయక్, మునిసిపల్ మేనేజర్ రాంబాబు, డి.ఈ.ఈ హేమ చంద్ర ,టి.పి.యస్ మారుతి ప్రసాద్,శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్‌బాషా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు,యోగా గురువు కృష్ణయ్య, యం.జె. యాప్‌లయన్ డాక్టర్ లయన్స్ క్లబ్ విడిజి16జె ఏలాక్టె డ్, విరుపక్ష రెడ్డి, డి.టి.శ్రీని వాసులు, గుత్తి ఫోర్ట్ బి.సి వెంకప్ప,మహబూబ్ భాషా,లయన్స్ క్లబ్ సభ్యులు, సచి వాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, మెప్మా ఆర్.పి లు, మహిళా సంఘాల సభ్యు లు,పట్టణ ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పద్మవాని హైస్కూ ల్ యాజమాన్యం నిర్వాహ కులు,జెడ్.పి హై స్కూల్ ప్రి న్సిపాల్స్ మహబూబ్ భాషా, రామాంజనేయులు, సుంక న్న,ఉపాధ్యాయ సిబ్బంది, ఇతర సిబ్బంది,టి.డి.పి టౌన్ అధ్యక్షుడు యం.కె చౌదరి, చికెన్ శీనా,విద్యార్థులు, యోగా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవం తం చేయడమైనది. హరి తాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ గుత్తి - స్వచ్ఛ భారత్ అవగా హన కార్యక్రమాలను గాంధీ సర్కిల్





నుండి చెర్లోపల్లి పేట వరకు పెద్ద ఎత్తున ర్యాలీ ద్వారా అవగాహన చేపట్ట డమైనది.చెట్లు నాటి వాటిని సంరక్షిం చుకొనుట అందరి బాధ్యతగా,ప్లాస్టిక్ ను పూర్తి గా నిషేధం చేయుట, యోగా ను ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక భాగం చేయూకోవాలని కమీషనర్ ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశా రు.యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం అగుటలో సహకరించిన ప్రతి ఒక్కరికి మునిసిపల్ ఆఫీసు ద్వారా కృతజ్ఞతలు తెలిపుతున్నా మని కమీషనర్ బి.జబ్బార్ మియా తెలియజేశారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**- ఆరోగ్యకరమైన జీవితానికి యోగ దివ్య ఔషధమని చాటిన ప్రజలు**
**- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యోగా డే వేడుకలు**
**- అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అనూహ్య స్పందన**

**మదనపల్లి -సూర్య వాస్తవం ,జూన్ 21:** ఆరోగ్యకరమైన జీవితానికి యోగ దివ్య ఔషధమని అంతర్జాతీయ యోగా దినోత్సవం లో ప్రజలు చాటి చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్వర్ణాంధ్ర యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మదనపల్లి శాసనసభ్యులు మహమ్మద్ షాజహాన్ భాష ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఎన్‌జిఓ సంఘాలు, గ్రామ పంచా యతీలు, సచివాలయాల పరిధిలో యోగ కార్యక్రమాలు కొనసాగాయి. ఇందులో స్థానిక ప్రజలు, ప్రభుత్వ అధికారులు, వివిధ ఎన్ జి ఓ సంస్థ ల ప్రతినిధులు, యోగా మాస్టర్లు, పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ, చైతన్య స్వచ్ఛంద సంస్థ విద్యార్థులు, కార్యాలయం సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని యోగ ఆసనాలు వేశారు. ప్రతి ఒక్కరు యోగా ఆసనాలు వేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడు కోవడంతో పాటు ఆరోగ్య






అంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో బాగస్వాములైనందుకు నిర్వా హకులు శుభా కాంక్షలు తెలిపారు. అలాగే విద్యార్థిని విద్యా ర్థులు వారి తల్లిదండ్రులు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, స్థానిక సంస్థ ల ప్రజా ప్రతి నిధులు, సచివాలయ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు ప్రజలు పాల్గొని యోగ చేయడం జరిగింది. అనంతరం యోగా కార్యక్రమం పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యోగాను ఆచరించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆహ్లాదకరమైన జీవితాన్ని కొనసాగిం చవచ్చునని సూచించారు.నిత్య జీవితంలో యోగాను భాగ స్వామ్యం చేసు కోవాలన్నారు. ప్రపంచానికి భారతదేశ అందించిన ఆరోగ్య బహుమానం యోగా అని గుర్తు చేశారు. యోగ మానసిక శారీరక ఆరోగ్యాన్ని అందించే అత్యుత్తమ మార్గ మన్నారు. యాంత్రిక జీవితంలో ప్రతి ఒక్కరు ఒత్తిడి ని జయించడానికి యోగ అత్యుత్తమ మార్గమని స్పష్టం చేశారు. పిల్లలు, విద్యార్థులు బాల్యం నుంచి యోగాను అభ్యసించి ఆచరించాలని సూచించారు.

# "యోగ చేయండి..... ఆరోగ్యాన్ని కాపాడుకోండి"

**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం,జూన్ 21:** యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన కర్నూల్ వారి సహకారంతో పత్తికొండ సమీకృత సాంఘిక సంక్షేమ హాస్టల్ నందు ఘనంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.యోస్పందన ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శరీరంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉంటారని తద్వారా విద్యార్థులు చురుకుగా విద్యభ్యాసాన్ని కొనసాగించి తమ లక్ష్యాలను త్వరగా చేరుకోవడంలో యోగాను నిత్యము ప్రతిదినము చేస్తూ ఉండాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వార్డెన్ నాగరాజు ,యువ స్పందన సభ్యులు మధుబాబు,రమేష్, ఎన్ వై కే ఎస్ వాలంటీర్ భారతి విద్యార్థులు పాల్గొన్నారు.






# నా శరీరం... నా ఇష్టం: శృతిహాసన్

## తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నానన్న శృతి

టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శృతిహాసన్, తన వ్యక్తిగత విషయాలపై ఎప్పుడూ ముక్కుసూటిగా వ్యవహరిస్తారు. ముఖ్యంగా కాస్మెటిక్ సర్జరీల విషయంలో తన అభిప్రాయాలను నిర్భయంగా పంచుకుంటారు. తాజాగా మరోసారి తన ముక్కుకు చేయించుకున్న ప్లాస్టిక్ సర్జరీ గురించి, ఆ నిర్ణయం వెనుక గల కారణాలను శృతిహాసన్ సూటిగా వివరించారు.

"టీనేజ్‌లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చేది కాదు, అందుకే ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాను. అంతేకాదు, ముఖం మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి ఫిల్లర్స్ కూడా వాడాను" అని ఆమె తెలిపారు. "ఈ విషయాలు దాచాల్సిన అవసరం నాకు కనిపించలేదు. చాలా సందర్భాల్లో ఈ విషయాన్ని చెప్పాను. కొందరు ఇలాంటివి బయటకు చెప్పడానికి ఇష్టపడరు, అది వారి వ్యక్తిగత అభిప్రాయం. దాన్ని నేను గౌరవిస్తాను. అలాగే, నా విషయాలను ధైర్యంగా చెప్పుకునే స్వేచ్ఛ నాకు ఉంది. అది తప్పు కాదని నేను నమ్ముతున్నాను" అని శృతి వివరించారు.

భవిష్యత్తులో అవసరమైతే ఫేస్‌లిఫ్ట్ కూడా చేయించుకునే అవకాశం ఉందని ఆమె అన్నారు. "ఇది పూర్తిగా నా నిర్ణయం. ఇతరులకు ఇబ్బంది కలగనంత వరకు, నా శరీరం గురించి నేను తీసుకునే నిర్ణయాలను ఎవరూ ప్రశ్నించాల్సిన అవసరం లేదు" అని శృతి హాసన్ స్పష్టం చేశారు. కాగా, శృతి ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీకాంత్‌తో కలిసి 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

### ఇతరుల మాటలతో

# ప్రశాంతత కోల్పోవద్దు

## - మానసిక ప్రశాంతతపై నటి సమంత ఇన్‌స్టాలో పోస్ట్


ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఓ సందేశాత్మక పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇతరుల మాటల వల్ల మానసిక ప్రశాంతతను దెబ్బతీయవద్దంటూ ఆమె తన ఇన్‌స్టా స్టోరీస్‌లో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పోస్ట్ వెనుక నిర్దిష్ట కారణమేమిటో స్పష్టంగా తెలియకపోయినప్పటికీ, ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించి వస్తున్న వార్తల నేపథ్యంలో ఇది మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.



"ఇతరుల మాటలను పట్టించుకోకుండా నిబ్బరంగా ఉండేందుకు ప్రయత్నించండి. ఏదైనా జరగనీ అన్నట్లు ఉంటే ప్రశాంతత రాదు.. దాని కోసం నిరంతర సాధన అవసరం. ప్రశాంతతను ఆస్వాదించాలి గానీ.. దానితో పోరాడొద్దు. జరగాల్సిన దాన్ని జరగనివ్వాలి," అంటూ సమంత తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "'నేను చేయాల్సింది' అనే భావనను 'నేను తప్పకుండా చేయాల్సిందే' అనే విధంగా మార్చుకోవాలి. మనసు వేగంతో కాదు.. నిశ్చలత్వంతో ప్రశాంతంగా మారుతుంది. మనం పెట్టుకునే సరిహద్దులు ఆత్మగౌరవంలో భాగమే. అంతేగానీ.. ఒత్తిళ్లు గౌరవానికి అవరోధం కాకూడదు. మీ శక్తిని తీసుకోవడానికి ఎవరూ అర్హులు కాదు," అని ఆమె రాసుకొచ్చారు.

# ఫాలోవర్స్ లేక అవకాశాలు కోల్పోయాను

### - శివాత్మిక రాజశేఖర్



టాలీవుడ్ సీనియర్ నటులు రాజశేఖర్, జీవితల కుమార్తెగా సినీ రంగ ప్రవేశం చేసిన యువ నటి శివాత్మిక రాజశేఖర్, ప్రస్తుతం సినీ పరిశ్రమలో నెలకొన్న కొన్ని పోకడలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాలెంట్ కంటే సోషల్ మీడియా ఫాలోవర్ల సంఖ్యకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ కారణంగా తాను కొన్ని అవకాశాలు కోల్పోయా నని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. శివాత్మిక రాజశేఖర్ 2019లో 'దొరసాని' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయ మయ్యారు. తొలి సినిమాలోనే తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుని, సైమా ఉత్తమ నూతన నటి అవార్డును కూడా గెలుచుకున్నారు. ఆ తర్వాత 'పంచతంత్రం', 'రంగమార్తాండ' వంటి తెలుగు చిత్రాలతో పాటు, తమిళంలో 'ఆనందం విలయదుం వీడు', 'నితమ్ ఒరు వానం' వంటి సినిమాల్లో నటించారు. గ్లామర్ పాత్రలకు దూరంగా, నటనకు ఆస్కారమున్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తు న్నారు.

అయితే, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, సినీ పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితిపై ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ప్రస్తుతం ఇండస్ట్రీలో ప్రతిభ కంటే సోషల్ మీడియా ప్రభావమే ఎక్కువగా ఉంది. నాకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్ తక్కువగా ఉన్నారనే కారణంతో కొన్ని సినిమా ఆఫర్లు చేజారిపోయాయి. నా స్థానంలో ఎక్కువ ఫాలోవర్లు ఉన్నవారిని తీసుకున్నారు" అని శివాత్మిక వాపోయారు.



# జైస్వాల్ వరల్డ్ రికార్డు..

## - బ్రాడ్‌మన్‌ను వెనక్కినెట్టిన యువ బ్యాటర్!
## - ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు.. మొదటి రోజు భారత్ 359/3



ఇంగ్లాండ్‌తో హెడింగ్లీలో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్ మొదటి రోజు ఆటలో భారత బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (101), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (127 నాటౌట్) అద్భుత శతకాలతో చెలరేగగా, వైస్-కెప్టెన్ రిషభ్ పంత్ (65 నాటౌట్) ధనాధన్ అర్ధశతకం నమోదు చేశాడు. నిన్న తొలిరోజు ఆట ముగిసే సమయానికి భారత్ 3 వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది.

**జైస్వాల్ శతకం.. వరల్డ్ రికార్డు**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత ఆరంభాన్నిచ్చాడు. కేవలం 159 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 101 పరుగులు చేసిన జైస్వాల్, భారత ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. ఈ సెంచరీతో యశస్వి ఒక అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇంగ్లాండ్‌పై టెస్టుల్లో (కనీసం 500 పరుగులు చేసిన వారిలో) అత్యధిక బ్యాటింగ్ సగటు కలిగిన ఆటగాడిగా నిలిచాడు.

ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్‌లలో 813 పరుగులు చేసిన జైస్వాల్ 90.33 సగటుతో, ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మాన్ (63 ఇన్నింగ్స్‌లలో 5028 పరుగులు, 89.78 సగటు) రికార్డును అధిగమించాడు. ఇంగ్లాండ్‌పై 90కి పైగా సగటు నమోదు చేసిన తొలి బ్యాటర్ కూడా జైస్వాలే కావడం విశేషం.

**గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్.. పంత్ దూకుడు**

జైస్వాల్ నిష్క్రమణ అనంతరం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఎంతో పరిణతితో నిలకడగా బ్యాటింగ్ చేసిన గిల్ 175 బంతుల్లో 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 127 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో గిల్ టెస్టు క్రికెట్‌లో 2,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. మరోవైపు రిషభ్ పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడి 102 బంతుల్లో 6 ఫోర్లు, 2 భారీ సిక్సర్లతో 65 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. పంత్ కూడా ఈ ఇన్నింగ్స్‌లో 3,000 టెస్టు పరుగుల మార్కును అందుకున్నాడు. గిల్, పంత్ జోడీ అజేయంగా నాలుగో వికెట్‌కు 138 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

### ఒక్క చేత్తో సిక్స్ కొట్టి

# సెంచరీ పూర్తి చేసుకున్న పంత్...

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న లీడ్స్ టెస్టు మ్యాచ్‌లో భారత యువ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన పంత్, ఇంగ్లాండ్ గడ్డపై తనదైన దూకుడైన ఆటతీరుతో చెలరేగిపోయాడు. టెస్టు మ్యాచ్ రెండో రోజైన శుక్రవారం, పంత్ కేవలం 146 బంతుల్లోనే 10 ఫోర్లు, 4 భారీ సిక్సర్ల సహాయంతో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ బౌలింగ్‌లో ఒంటి చేత్తో సిక్సర్ బాది శతకం అందుకోవడం ఈ ఇన్నింగ్స్‌కే హైలైట్. 44వ టెస్టు ఆడుతున్న పంత్‌కు ఇది ఏడో టెస్టు శతకం కావడం విశేషం.

**ధోనీ రికార్డును అధిగమించిన పంత్**

ఈ సెంచరీతో రిషభ్ పంత్, భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉన్న ఒక అరుదైన రికార్డును బద్దలు కొట్టాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన భారత వికెట్ కీపర్ బ్యాటర్‌గా పంత్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. ధోనీ తన కెరీర్‌లో 90 టెస్టు మ్యాచ్‌లు ఆడి 6 సెంచరీలు సాధించగా, అవన్నీ ఆసియాలోనే కావడం గమనార్హం. కాగా, పంత్ కేవలం 44 టెస్టుల్లోనే 7 సెంచరీలు బాది ఈ ఘనతను అందుకున్నాడు. ఇందులో మూడు సెంచరీలు ఇంగ్లాండ్‌లోనే నమోదు కాగా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల్లో కూడా ఒక్కో శతకం సాధించాడు. ఈ ప్రదర్శనతో భారత జట్టు రెగ్యులర్ వైస్ కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే పంత్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.

**ఇంగ్లాండ్‌లో పంత్ అరుదైన ఘనత**

ఇంగ్లాండ్ గడ్డపై పంత్ నెలకొల్పిన రికార్డు మరింత ప్రత్యేకం. ఇప్పటివరకు ఏ విదేశీ వికెట్ కీపర్ కూడా ఇంగ్లాండ్‌లో ఒకటి కంటే ఎక్కువ టెస్టు సెంచరీలు చేయలేదు. అలాంటిది పంత్ ఏకంగా మూడు శతకాలు బాది చరిత్ర సృష్టించాడు. 2018లో ఇంగ్లాండ్‌లోనే తన టెస్టు అరంగేట్రం చేసిన పంత్, అదే పర్యటనలోని చివరి



టెస్టులో కూడా శతకంతో మెరిసిన సంగతి తెలిసిందే. టెస్టుల్లో పంత్ ఎనిమిది సార్లు 90 నుంచి 99 పరుగుల మధ్య అవుటవడం అతని దూకుడైన ఆటకు నిదర్శనం. గత ఏడాది న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా 99 పరుగుల వద్ద వెనుదిరిగాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఆశించినంతగా రాణించలేకపోయిన పంత్, ఈ సెంచరీతో ఘనంగా పుంజుకున్నాడు.

**ప్రపంచ వికెట్ కీపర్లలో పంత్ స్థానం**

ప్రపంచ క్రికెట్‌లో వికెట్ కీపర్‌గా అత్యధిక టెస్టు సెంచరీలు చేసిన వారి జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్ 17 శతకాలతో అగ్రస్థానంలో ఉన్నాడు. జింబాబ్వే మాజీ కెప్టెన్ ఆండీ ఫ్లవర్ 12 సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. 1929 నుంచి 1939 వరకు ఇంగ్లాండ్ తరఫున ఆడిన లెస్ ఎమ్స్ 8 సెంచరీలు చేశాడు. దక్షిణాఫ్రికా స్టార్ ఏబీ డివిలియర్స్, ఇంగ్లాండ్ మాజీ కీపర్ మాట్ ప్రయర్, శ్రీలంక లెజెండ్ కుమార్ సంగక్కర, న్యూజిలాండ్ ఆటగాడు బీజే వాట్లింగ్ కూడా వికెట్ కీపర్లుగా పంత్‌తో సమానంగా 7 టెస్టు సెంచరీలు సాధించారు. పంత్ ప్రస్తుత ఫామ్ కొనసాగిస్తే మరిన్ని రికార్డులు బద్దలు కొట్టడం ఖాయమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# యోగాను సైన్సు అంగీకరించదెందుకు..?







సూర్యవాస్తవం-ప్రత్యేక ప్రతినిధి

ప్రతి ఒక్క మనిషికి నిత్యజీవితంలో శారీరక శ్రమ అనేది ఒక భాగంగా ఉండాలి. కొన్నేళ్ళ క్రితం వరకూ శారీరక శ్రమకు చాలా విలువ ఉండేది. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా జీవన విధాన శైలిలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతంలో తినే తిండిలో కానీ వ్యవసాయ పనులలో రకరకాల పనులు చేస్తున్నందువల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చేటివి కాదు. పొలాలకు వెళ్ళడం, నాగలి దున్నడం, పశువులు మేపడం లాంటి ఏ పని చేసినా అది శారీరక శ్రమతో కూడుకున్నదే! గృహిణులు ఇంటి పనులే కాకుండా వ్యవసాయపు పనులు కూడా చేసేవారు. వడ్లు దంచడం, పిండి రుబ్బటం లాంటివన్నీ శారీరక శ్రమలే! అవన్నీ జీవన శైలిలో అంతర్భాగంలో ఉండేవి. ప్రత్యేకంగా వ్యాయామం చేయడం ఉండేది కాదు. పరిశ్రమలు పెరిగి, యంత్రాలు వచ్చి శారీరక శ్రమ స్థానంలో బుద్ధిబలానికి విలువ పెరుగుతున్నకొద్దీ వ్యాయామం అవసరమైంది. ఆటలు అవసరమయ్యాయి. అందుకే అన్ని రకాల వ్యాయామాల్ని, జిమ్నాస్టిక్స్ ని, ఆటల్ని, క్రీడల్ని సైన్సు ఆమోదించింది. ముక్కు మూసుకుని చేసే ధ్యానాన్ని, యోగాను, సమాధిని సైన్సు అంగీకరించలేదు.

ఆటలు, క్రీడలతో శారీరక శ్రమ వస్తుంది. శారీరక శ్రమతో జీవన క్రియలన్నీ ప్రారంభమవుతాయి. ప్రారంభమైనవి వేగాన్నందుకుంటాయి. దాంతో శరీర గ్రంథులూ, మెదడూ అవసరమైన రసాయనాల్ని విడుదల చేస్తాయి. ఫలితంగా శరీరంలో కణస్థాయి నుంచి అన్ని వ్యవస్థలలో చురుకుదనం పెరిగి మనిషి ఆరోగ్యవంతుడవుతాడు. ఆనందాన్ని అనుభవిస్తాడు. వేగంగా నడవడాన్ని, ఈత కొట్టడాన్ని, సైకిల్ తొక్కడాన్ని, కర్రసామును, జిమ్ లోని అనేక వ్యయామాల్ని జీవశాస్త్రం వైద్య శాస్త్రం ఒప్పుకుంది. ప్రోత్సహించింది కూడా. మరీ చిన్నపిల్లలయితే ఆటపాటలతో పాటు అనందంగా విద్యనేర్చుకునే వసతి ఉండాలని విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ తన శాంతినికేతన్ లో ఆ ఏర్పాట్లు చేశారు. ఆటలకూ, క్రీడలకూ దేవుడితోనూ, మతాలతోనూ సంబంధం లేదు. కానీ, హిందూ మతానికి సంబంధించి కొందరు యోగాను, ధ్యానాన్ని, సమాధిని పరమాత్మలో లీనమయ్యేందుకు మార్గంగా ఎంచుకున్నారు. ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు లంకె పెట్టారు. అందువల్ల వీటిని సైన్సు గుర్తించదు. మతధర్మాల్లాగా ఇవీ విశ్వాసాలుగా ఉండిపోతాయి. ముందుగా ఆ తేడాను గమనిస్తే వాటి స్థానాలేమిటో బోధపడుతుంది.

యోగాను ప్రతిపాదించిన పతంజలి "యోగః చిత్తవృత్తి నిరోధకః" అని అన్నాడు. అంటే యోగ ఆలోచనల్ని స్థంభింపజేస్తుందని అర్థం! అంతే కాదు. యోగ మోక్షానికి మార్గమనే చెప్పాడు పతంజలి అంతేకాని, ఆరోగ్యసాధనకోసం ఇది పనికొస్తుందని చెప్పలేదు. ఇటీవలి కాలంలో ఆధునిక యోగా గురువులు వారి వారి ఆలోచనల్ని జోడించి, జనాన్ని మభ్యపెడుతూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ ఆధునిక వ్యాపార గురువులు యోగ కాన్సర్, ఎయిడ్స్ ను కూడా తగ్గిస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. పతంజలి యోగాను ప్రతిపాదించిన కాలానికి కాన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులు గుర్తించబడలేదు. యోగ ఈ వ్యాధుల్ని తగ్గిస్తుందంటే మరి నిరూపణ ఏదీ? వారి దగ్గర నిరూపణ ఏదీ లేదని కూడా మనకు తెలుసు. అయినా కూడా వారు పెట్టే 'చెవిలో పువ్వుని' భక్తితో పెట్టించుకుని, వారి పిట్టకథలు వింటూ ఉండాలని వారి కోరిక! యోగాతో సర్వరోగాలూ మటుమాయం అయ్యే మాటైతే నిత్యం యోగాను పాటించిన రామకృష్ణ పరమహంస, రమణ మహర్షులను కాన్సర్ ఎందుకు కబళించిందీ? నేటి కాలంలో యోగా గురువుగా ప్రసిద్ధుడైన రాందేవ్ బాబా మోకాళ్ళ ఆపరేషన్ కోసం విదేశాలకు ఎందుకు వెళ్ళినట్టూ? మనకు మనం ఆలోచించుకోవలసిన విషయాలు.

'యోగ' %-% అంటే వ్యాయామం అనే అర్థం కూడా ఉంది కదా? మరి దాన్ని తీసుకుంటే తప్పేమిటి? అనేవారు కొందరుంటారు. దేహదారుఢ్యానికి ఉపయోగపడే పరేడ్ సైనికులకు, ఎన్.సి.సి. కాడెట్ లకు ఉంటుంది. స్కూలు పిల్లలకు డ్రిల్ పీరియడ్ ఉంటుంది. యోగ ఇలాంటి శారీరక వ్యాయామాల కిందికి రాదు. వైద్య రంగంలో 'ఫిజియోథిరపీ' ట్రీట్ మెంట్ ఉంది. ఏ రోగికి ఎలాంటి వ్యాయామం అవసరమో, అది ఎంత కాలం చేయాల్సి ఉంటుందో వైద్య నిపుణులు నిర్ణయిస్తారు. జిమ్స్ లో కూడా ట్రైనర్లు ఉంటారు. మీ ధ్యేయమేమిటో తెలుసుకుని, మీకు ఎలాంటి వ్యాయామం అవసరవెూ వారు అలాంటివి నిర్ధారిస్తారు. చెప్పుకోవాల్సింది ఏమంటే వ్యాయామానికి ఒక ధ్యేయం ఉంటుంది. ఏం కావాలనుకుంటున్నాం-ఏం సాధించాలనుకుంటున్నాం అనేదానిమీద ఎక్సర్ సైజ్ ప్రోగ్రాంలుంటాయి. వైవిధ్యభరితంగా ఇన్ని ఆటలు, క్రీడలు, వ్యాయామాలు ఉండగా యోగా ఎందుకు? దాని వల్ల ఒనగూరే ప్రయోజనమేముందీ? అనేది సీరియస్ గా ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది. చదువుల్లో కూడా అంతే కదా? మనం ఏం కావాలనుకుంటున్నామో, దాన్ని బట్టే కోర్సులుంటాయి.

డాక్టర్ అశోక్ రాజ్ గోపాల్ మోకాలి చిప్ప మార్పిడి చేసే ప్రత్యేక నిపుణుడు నీ రిప్లేస్ మెంట్ సర్జన్. ఆయన చెప్పిన విషయాల్ని 'ద డెయిలీ టెలిగ్రాఫ్' ప్రకటించింది. న్యూఢిల్లీకి చెందిన డీన్ నెల్సన్ కూడా కొన్ని వివరాలు అందించాడు. ఈ భారతీయ వైద్య నిపుణులు ఇచ్చిన వివరాలను, వివరణలను బట్టి మనం తెలుసుకోగలిగేది ఏమంటే చాలా మంది యోగా గురువులు మోకాలి చిప్ప మార్పిడికోసం సర్జరీ చేయించుకున్నవారే! ఇంకా చాలామంది ఇప్పటికీ సర్జరీ లైన్లో నిలబడుతున్నవారే. 'థండర్ బోల్ట్' అనే వజ్రాసనం వేసేవారికి ఈ మోకాలి చిప్ప ఆపరేషన్ లు తప్పని సరి అవుతున్నాయి. ఇంతకూ వజ్రాసనం ఎలా వేస్తారు? అంటే మోకాళ్ళు రెండూ వెనక్కి మడిచి, మడిమెల మీద కూర్చుంటారు. దాని వల్ల మోకాళ్ళు ఒత్తిడికి గురై నాడులు, జాయింట్లు దెబ్బతింటాయి. ఫలితంగానే యోగా గురువులు, వారి శిష్యులు కలసికట్టుగా సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోంది. ఈ విషయం మీద ఇంటర్ నెట్ లో చాలా సమాచారం ఉంది. కావల్సిన వాళ్ళు వెతుక్కోవచ్చు. మరో ముఖ్యవిషయమేమంటే ఈ యోగా గురువులు ఎవరికీ మానవ శరీర నిర్మాణానికి సంబంధించిన అవగాహన ఏమాత్రం ఉండదు. ఇష్టం వచ్చినట్టుగా కాళ్ళు, చేతులు, మెడ, భుజాలు వంచి విచిత్రమైన భంగిమలలో జనాన్ని ఆకర్షిస్తుంటారు.

యోగా వల్ల కీళ్ళ నొప్పులు వస్తాయని, ముందే నొప్పులు ఉన్నవారికి అవి అధికమౌతాయనీ ఆర్థోపెడిక్ డాక్టర్లు వివరణ ఇస్తున్నారు. వెన్నెముకను విల్లులా వెనకకు వంచడం వల్ల అనేక అనర్థాలున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. మనిషి వెన్నెముక ముందుకు వంగడానికి అనువుగా నిర్మాణమై ఉంది. మరి అందుకు విరుద్ధంగా వెనకకు వంచడమంటే రిస్కు తీసుకోవడమే కదా? నడుముకు పై భాగాన ఉన్న అవయవాలన్నీ వెన్నెముక ఆధారంగా నిలబడి ఉన్నాయి. అసలు మనిషి నిటారుగా నిలబడాలంటేనే వెన్నెముక బలంగా ఉండాలి. శరీరాన్ని నిల బెట్టాలి. మనిషి బరువంతా కాళ్ళ మీద, నడుము మీద, వెన్నెముక మీద ఉంటుంది. ఆవు, గేదె, పులి, పిల్లి వంటి జంతువుల్లాగా కాదు. ఆ జంతువు వెన్నెముక భూమికి సమాంతరంగా ఉంటుంది. బరువంతా నాలుగు కాళ్ళమీద ఉంటుంది. మనిషికి ఆ వసతి లేదు. మనిషి వెననెముక భూమికి నిటారుగా ఉంటుంది. మనిషనే జెండాను ఎగరేస్తున్నట్టు మనిషి వెన్నెముక జెండా కర్రలాగా, భూమికి 90 డిగ్రీల కోణంలో నిలబడి ఉంటుంది. అంటే భూమి ఆకర్షణ శక్తిని ఎదుర్కొంటూ వెన్నెముక మనిషిని నిలబెడుతుంది. అలాంటి ముఖ్యమైన భాగాన్ని ఇష్టం వచ్చినట్టు వంచడం అనేది తెలివైన పని కాదు. బాల్యం నుండే ఆసనాలు అభ్యాసం చేసేవారి విషయం వేరు. మధ్యవయస్సులో, వృద్ధాప్యంలో ప్రారంభించేవారు సమస్యలు ఎదుర్కోక తప్పదు. ప్రతివాడూ మల్లయోధుడో, సర్కస్ కళాకారుడో కానవసరం లేదు. ప్రతి జీవికి కొన్ని సౌలభ్యాలుంటాయి. కొన్ని అవరోధాలుంటాయి. వాటిని గమనించుకుంటూ జీవించడం మంచిది.

ప్రాణాయామంలో గట్టిగా శ్వాసపీల్చి, వదిలేయాల్సిన గాలిని, అంటే కార్బన్ డై ఆక్సైడ్ ను వదిలివేయకుండా ఎక్కువ సేపు ఊపిరి తిత్తుల్లో బలవంతంగా ఆపడం జరుగుతుంది. అది మంచిది కాదని నిపుణులు చెపుతారు. ఎక్కువ ఆక్సీజన్ పీల్చుకుంటే ఆరోగ్యం చేకూరుతుంది. కానీ కార్బన్ డై ఆక్సైడ్ సత్వరం వదిలేయాల్సిన వాయువు. శరీరంలోని జీవన క్రియల్ని నిర్వర్తించడానికి మొత్తానికి మొత్తంగా శారీరక ధర్మాల్ని పర్యవేక్షించడానికి మెదుడుకు ఎక్కువ రక్తం అవసరమౌతుంది. శరీరానికి అందే ఆక్సీజన్ లో 20 శాతం మెదడే ఉపయోగించుకుంటుంది.

యోగా చేసేటప్పుడు మెదడుకు తగినంత ఆక్సీజన్ అందదు. అందుకే మెదడు స్తబ్దుగా అయిపోయి, భ్రమలు కలగడం ప్రారంభమౌతాయి. అలాగే సుష్టుగా భోజనం ముగించాక చూడండి ఒళ్ళంతా బరువుగా, బద్ధకంగా, స్తబ్దుగా ఉంటుంది. అలా ఎందుకూ అంటే %-% జీర్ణాశయం నిండిన ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ మొత్తంలో రక్తం జీర్ణవ్యవస్థకు చేరుతుంది. ఫలితంగా మెదడుకు ఆక్సీజన్, రక్తప్రసరణ తాత్కాలికంగా తగ్గుతాయి. కాలో, చెయ్యో తిమ్మిరెక్కడం అలాంటిదిదే %-% రక్త ప్రసరణలో అంతరాయమే- యోగ, ధ్యానం చేయడం వల్ల, సమాధిలోకి పోవడం వల్ల జరుగుతున్నదీ అదే! ఆలోచనల్ని అరికట్టి, మెదడును మొద్దుబారించి, భ్రమల్లోకి, కల్పనల్లోకి పోవడమే!

'శ్వాస మీద ధ్యాస' అని చెపుతారు కొందరు. అంటే ఏమిటీ? కళ్ళుమూసుకుని, శ్వాసమీద ధ్యాస పెట్టి ఇష్టదైవాన్ని తలచుకోవడం. అట్లా అట్లా భ్రమల్ని ఊహల్ని పెంచి పోషించుకుని దైవదర్శనమయ్యిందని సంతృప్తిని పొందవచ్చు. ఈ ఐహిక బంధాల్లోంచి బయటపడి ఒక స్థాయికి ఎదిగి తపస్సు చేస్తే ఆధ్యాత్మికశక్తిని సాధించగలమని సాధువులు చెబుతుంటారు. అసలు విషయమేమంటే మెదడుకు తగినంత ఆమ్లజని అందక, కలిగే భ్రమలే అవి! మనకు సాధువులు, మహర్షులు ఉన్నారు. ఇన్నివేల ఏళ్ళలో వీరిలో ఎవరైనా తపస్సు చేసి, వాస్తవంగా దేవుణ్ణి ప్రత్యక్షం చేసుకున్నారా? తమ దేవుణ్ణి పక్కవారికెవరికైనా చూపించి పరిచయం చేశారా? లేదే మెదడును పనికిరాని పదార్థంగా మార్చుకోవడం గొప్పపని కాదు.దాన్ని నిరంతరం వాడుతూ కొత్త కొత్త అన్వేషణలు, ఆవిష్కరణలు చేయడమే మనిషి ధ్యేయం కావాలి. చురుకైన అవయవాన్ని మరింత చురుకుగా చేసుకోవడమే విజ్ఞుల పని!

'జ్ఞాన సాధన పేరుతో మెదడును తిమ్మిరెక్కించి, భ్రమల్లో తేలిపోయి, దివ్య లోకాల సందర్శనం అంటూ, దైవదర్శనమయ్యిందనే భ్రమలో జనానికి తప్పుడు సమాచారమిచ్చేవారిని పిచ్చివాళ్ళకింద జమకట్టాలి. మహానుభావులెప్పుడూ తోటివారికి పనికొచ్చే పని చేస్తారు. తమను తాము వ్యర్థులుగా మార్చుకునే ప్రక్రియలు చేపట్టరు. జనానికి తప్పుడు దారులు చూపించరు. వాస్తవంలోనే భవ్యమైన భవితకు దారులు వేస్తారు.



## 5000 మందితో యోగాంధ్ర విజయవంతం

### - యోగా వేదికపై తహసిల్దార్ నరసింహకు కలెక్టర్ చేత ఘన సత్కారం




**రాయచోటి - సూర్య వాస్తవం, జూన్ 21:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బంగ్లా సర్కిల్ లో ఉన్న కళాశాలలో శనివారం 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం లో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి,కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్, డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి తాహసిల్దార్ నరసింహా కుమార్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసులు పాల్గొని యోగా చేసారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నేతలు, స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు, సంఘ సంస్కర్తలు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యోగ కార్యక్రమం ముగిసిన తర్వాత రాయచోటి మండల తహసిల్దార్ నరసింహా కుమార్ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా యోగ పై పాట రచించి పాడిన ఈయన మధురకంఠం అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డిఓలు సంయుక్తంగా వేదికపై శాలువా కప్పి సత్కరించారు.

## విజయ భారతి స్కూల్‌లో యోగ దినోత్సవం




**మదనపల్లి - సూర్య వాస్తవం, జూన్ 21:** జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం విజయ భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు యోగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హై స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్ సేతు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా మదనపల్లి డీయస్పీ మహేంద్ర, టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మునిసిపల్ ఛైర్పర్సన్ మనుజా రెడ్డి, విజయభారతి స్కూల్ యాజమాన్యం, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లి నరసింహా రెడ్డి, జనసేన రాయలసీమ కో కన్వీనర్ రాందాస్ చౌదరి, బిజెపి నాయకులు డాక్టర్ అజ్మతుల్లా ఖాన్, బియస్పి రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్, శ్రీ చందు, బిజెవైయం నాయకులు బండి ఆనంద్, వైకాపా నాయకులు సాయి శేఖర్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విజయ భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం ఇతర సాంస్కృతిక కలలు, భరతనాట్యం లో విద్యార్థుల కు ఆసక్తి కల్పించి అ దిశగా వారిని ముందుకు తీసుకెళ్లే విధంగా గురువులను నియమించి ప్రోత్స హించడాన్ని కొని యాడారు. యోగ అనేది శరీరము మనసు ఆత్మను ఏకం చేసే సాధనం అన్నారు. ప్రశాంతమైన ఆరోగ్యకరమైన జీవితానికి యోగా దోహద పడుతుందని సూచించారు.

## 18 వ రోజుకు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె

### - బిక్షాటనతో అర్ధనగ్న ప్రదర్శన, నిరసన

### - ప్రభుత్వం స్పందించకపోతే విధులను బహిష్కరించి పూర్తి స్థాయిలో సమ్మె



**మదనపల్లి - సూర్య వాస్తవం, జూన్ 21:** మదనపల్లె మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె లో భాగంగా చేపట్టిన నిరసన శనివారం 18 వ రోజు కు చేరింది. ఇందులో భాగంగా అర్ధనగ్న ప్రదర్శనతో పట్టణం లో బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఇంజనీరింగ్ కార్మిక జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ బ్రతుకులు రోడ్ల పైకి ఈడ్చేటట్లు చేస్తోందని అందుకే తాము బిక్షాటన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నేటిలోగా తీర్చకపోతే 22 నుండి పూర్తి స్థాయిలో విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అందులో భాగంగా మదనపల్లె సబ్ కలెక్టర్‌కు, మదనపల్లె డీయస్పీకి, ఒకట, రెండవ పోలీస్ స్టేషన్ సిఐ లకు, మదనపల్లె మున్సిపల్ కమీషనరుకి, పర్మనెంట్ ఉద్యోగుల జేఏసీ కి కూడా సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లో జేఏసీ నాయకులు ఎస్ కె రెడ్డప్ప, నాగరాజు బాబు, బాలకృష్ణ, గోపాలకృష్ణ, కన్నయ్య కుమార్, సజాద్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## యువత పోరు పేరుతో కలెక్టరేట్ వద్ద ధర్నా హాస్యాస్పదం

### - నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ



**మదనపల్లి –సూర్య వాస్తవం, జూన్ 21:** ఈ నెల 23న యువత పోరు పేరు తో కలెక్టరేట్ వద్ద వైకాపా ధర్నా చేస్తా మనడం హాస్యాస్ప దమని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ...మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి 2019 – 24 వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను మోసం చేయలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న కంపెనీలను కమిషన్ల కోసం వేధించి ఇతర రాష్ట్రాలకి పంపిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందని, వైకాపా అధికారం కోల్పోగానే యువతను ధర్నాలు, నిరసనలు పేరుతో రాష్ట్రంలోని ప్రజలను రెచ్చగొట్టి అలర్లు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని వైకాపా నాయకుల ఉద్దేశమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిరుద్యో గులను, యువతని దారుణంగా మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు యువత పోరు చేస్తే ప్రజలు నిన్ను నమ్మరన్నారు.

## భర్తను గొడ్డలితో నరికిన భార్య..

**మదనపల్లి –సూర్య వాస్తవం, జూన్ 21:** ఇంట్లో ఆర్థిక వ్యవహారాలు తలెత్తి భర్తపై భార్య గొడ్డలితో నరికి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శనివారం సాయంత్రం మదనపల్లి మండలంలో జరిగింది. ఇందుకు సంబంధించి తాలూ కా పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పోతబోలు గ్రామం, సిటిఎం రోడ్డు, ఎరగాని మిట్ట సమీపంలోని టిట్ కో ఇండ్లలో కాపురం ఉంటున్న మోహన్ నాయక్ 47, అతని భార్య శారద పొదుపు డబ్బు విషయమై సాయంత్రం గొడవ పడ్డారు. ఇద్దరి మధ్య మాట, మాట పెరిగి ఆమె ఇంట్లో ఉన్న గొడ్డలితో భర్త మెడపై నరకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. దీంతో మోహన్ నాయక్ కు ప్రణాపాయం తప్పింది. కేసు దర్యాప్తులో ఉంది.

## పామిడిలో వివాహిత అనుమానాస్పద మృతి

### - మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు

**పామిడి - సూర్య వాస్తవం, జూన్ 21:** గుంతకల్లు మండలం అయ్యవారిపల్లికి చెందిన రాజేశ్వరికి పామిడికి చెందిన ఈశ్వర్ రెడ్డితో వివాహమయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈశ్వర్ రెడ్డి నిన్ననే ఉద్యోగ నిమిత్తం కువైట్ కు బయల్దేరి వెళ్లారు. ఈమె శనివారం నాడు ఉదయం పామిడిలో అనుమానాస్పదంగా మృతి చెందిందని పోలీసులకు లిఖితపూర్వకంగా మృతురాలి తండ్రి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. తన కూతురు అనుమానాస్పదంగా మృతి చెందిందని ... దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనేపథ్యంలో పామిడి ఇన్ఛార్జి సి.ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వివిధ కోణాలలో దర్యాప్తు చేపట్టారు. రాజేశ్వరి మృతికి కారణాలపై లోతుగా విచారిస్తున్నారు. పారదర్శకంగా దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. ఎవరైనా వాస్తవాలు తెలుసుకోకుండా వదంతులు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని సి.ఐ తెలిపారు.

## ఆరోగ్యమే అసలైన ఐశ్వర్యం

### - విద్యార్థులకు ఎంఈఓ చూచనలు



**తిరుపతి, పెళ్లకూరు - సూర్యా వాస్తవం, జూన్ 21:** ఆరోగ్యమే అసలైన ఐశ్వర్యం అని పెళ్లకూరు మండల ఎంఈఓ మించల శంకరయ్య అన్నారు శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెళ్లకూరు మండలంలోని పాఠశాలలు 'యోగాంధ్ర–2025' కార్యక్రమాల కింద ఉత్సాహంగా యోగా వేడుకలు నిర్వహించాయి. విద్యార్థుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంచే లక్ష్యంతో యోగా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెంబెడు వేదికగా జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మించల శంకరయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉద్దేశించి మాట్లాడుతూ "ఆస్తి, పేరు, హోదా ఉన్నా ఆరోగ్యం లేకపోతే వ్యర్థమే. యోగా మనిషికి దక్కిన అద్భుతమైన వరం. దీనిని మన జీవితం లో భాగం చేసుకోవాలి" అని తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్ మాట్లాడుతూ, "యోగం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. దానివల్ల విద్యార్థుల చదువులోనూ మానసిక శాంతిలోనూ స్పష్టమైన మార్పు కనిపిస్తుంది" అని అన్నారు. పీడీ యోగా ట్రైనర్ మాధవయ్య విద్యార్థులకు యోగాసనాల ప్రాథమిక సాధన నిర్వహించారు. కార్యక్రమ అనంతరం విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ యోగా వేడుకల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులన్నీ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ప్రాథమిక పాఠశాలలో కూడా విశేష స్పందన :** పెళ్లకూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ప్రధానోపాధ్యాయురాలు దేవసేన మాట్లాడుతూ, ఈ యోగా దినోత్సవం యావత్ ప్రపంచాన్ని ఒకే దారిలో నడిపిస్తున్నది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆరోగ్యమే లక్ష్యంగా జరుపుకుంటున్న ఈ కార్యక్రమాన్ని మనం ప్రతి పౌరునిగా స్వీకరించాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నన్ను వెంకటేశ్వర్లు, ఎం.సునీల్, ప్రసన్న, అంగన్వాడి టీచర్ బుజ్జమ్మ, ఆయా లతా పాల్గొన్నారు. పాఠశాలలు యోగ కేంద్రాలుగా మారిపోయాయి. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమిష్టి కృషితో ఆదర్శంగా నిలిచింది.

## హెడ్ కానిస్టేబుల్ ఇజ్రాయేల్ ఇంట్లో అగ్ని ప్రమాదం

### - ఆర్థికమైన సహాయం చేయండి



**పామిడి- సూర్య వాస్తవం,జూన్ 21:**పామిడి పోలీస్ స్టేషన్‌లో సుమారు 4 సంవత్సరాలు నుండి హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇజ్రాయేల్ ఇంటిలో నిన్నటి దినం అనగా 20 వ తేదిన సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగడం వలన అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, ఇంటి సామాగ్రీ, దుస్తులు, గ్రూహెూ పకరణాలు పూర్తీగా సర్వం కాలిపోయి బూడిద అయినాయని వారు కట్టు బట్టలు తప్పా అన్నీ పూర్తిగా కాలిపోయి నాయని కావున మానవత దృక్పథం తో మన వంతు సహాయం చేద్దామని పామిడి ప్రజలు వేడుకుంటున్నామని తెలుపుచున్నాము .ఇజ్రాయేల్ ఫొన్‌పే 9440011294. కాల్ చేసి ఆర్థికమైన సహాయం చేయాలని కోరుతున్నారు

## కూరగాయల మార్కెట్‌లో 23న బహిరంగ వేలం

### - మున్సిపల్ కమిషనర్

**రాయదుర్గం టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 21:** రాయదుర్గం పట్టణం నందు ఉన్న కూరగాయల మార్కెట్ నందు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో ఏ, బి మరియు సి బ్లాకుల్లో ఖాళీగా ఉన్న 6 షాప్ లకు వాణిజ్య పరమైన వ్యాపారం చేసుకొనుటకు గానూ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 23 వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వేలం పాట లో పాల్గొనే వారు 3లక్షల విలువ గల సాల్వన్సి సర్టిఫికెట్ సమర్పించాలని తెలిపారు.వేలం పాటకు 2లక్షల గుడ్ విల్ చెల్లించి పాల్గొనవచ్చని తెలియజేశారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం


### - ఎండి నీలకంఠ



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం,జూన్ 21:** నేడు విరాట్ పాలి క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీరామ హాస్పిటల్ ఎండి,నీలకంఠ అన్నారు. శనివారం ఆయన పత్రిక ప్రకటన ద్వారా మాట్లాడుతూ మన ప్రాంతంలో అనారోగ్యాలతో బాధపడుతున్న ప్రజల కోసం వివిధ వైద్య ఉచిత సేవలను నిర్వహిస్తున్నట్లు ప్రజలకు తెలియజేశారు. ఈ శిబిరానికి అపారమైన అనుభవం గల డాక్టర్,లక్ష్మణ్ కుమార్ యాదవ్ హాజరవుతారని అన్నారు.మొదలగు ఆపరేషన్లు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా శ్రీరామ హాస్పిటల్ నందు ఆపరేషన్ చేస్తారని అన్నారు.కావున ప్రజలు ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

## యోగా తోనే సంపూర్ణ ఆరోగ్యం..

### - జీవితంలో యోగ ఒక భాగం కావాలి:ఎమ్మెల్యే కె ఈ శ్యామ్ బాబు




**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం,జూన్ 21 :** మానవ జీవితంలో యోగ ఒక భాగం కావాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పత్తి కొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ అన్నారు. శనివారం 11వ అంతర్జాతీయ యోగా డే దినోత్సవం సందర్భంగా పత్తి కొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు యోగ దినోత్సవంలో పాల్గొని యోగాసనాలు వేశారు. అలాగే స్థానిక తేరు బజారులో ఎమ్మెల్యే కే. ఈ. శ్యాంకుమార్, ఆర్డీవో భరత్ నాయక్, సీఐ జయన్న, గ్రామపంచాయతీ ఈవో నరసింహులు, సమీకృత వసతి గృహం వార్డెన్ నాగరాజు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు, ప్రజలు ఆయా శాఖల సిబ్బంది యోగా దినోత్సవం లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ యోగ అలవాటు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సూచించారు. విశ్రాంత యోగ మాస్టర్ బిపిసి రంగస్వామి యోగా పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

## తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎస్.ఎం భాష

**గుత్తి–సూర్య వాస్తవం, జూన్ 21:**

గుత్తి మండలం నూతన తహసిల్దార్‌గా బదిలీపై విచ్చేసిన పుణ్య వతిని,డిప్యూటీ తహసిల్దార్‌గా నియమితు లైన సూర్యనారాయ ణని ఎస్.ఎం భాష శనివారం కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 17వ వార్డు ఇంచార్జ్ మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్ ఎం బాషా, 17వ వార్డు అధ్య క్షుడు వడ్డే వెంకటేష్ పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )